www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి YADADRI BHUVANAGIRI | సంపుటి: 1 VOLUME : 1 | సంచిక: 297 ISSUE : 297 | బుధవారం, 25 మార్చి, 2026 WEDNESDAY, MARCH 25, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు: 8 PAGES : 8 | వెల: 5-00 RS : 5-00 |
|---|---|---|---|---|---|---|

## ఫార్ములా ఈ-రేస్ కేసు ముమ్మాటికీ లొట్టపీసు కేసే

- ఎక్కడా క్విడ్ ప్రో కో జరగలేదు
- నగదు బదిలీ కేవలం బ్యాంక్ టు బ్యాంక్ మాత్రమే జరిగింది
- డబ్బులు ఇంకా ఆ కంపెనీ దగ్గరే ఉన్నాయి
- ఛార్జ్‌షీట్లో ఆ కంపెనీ పేరు ఎందుకు లేదు?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్న

2 లో..

# దక్షిణాదిపై డీలిమిటేషన్ కుట్ర

- జనాభా ఆధారంగా సీట్లు పెంచితే దక్షిణాదికి నష్టం
- 50 సీట్ల పెంపులోనే కుట్ర ఉంది
- అధిష్ఠానం అనుమతిస్తే కేరళ ప్రచారంలో పాల్గొంటా
- దీన్నే ప్రధాన అస్త్రంగా మలచుకుంటా
- దక్షిణాది ఐక్యత.. ఎన్నికల ప్రచారాస్త్రం
- 2034 వరకు తెలంగాణలోనే ఉంటా..
- ఢిల్లీలో ఓ టీవీ ఛానల్ నిర్వహించిన సమ్మిట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 24:

అభివృద్ధి చేసినందుకు మాకు ఇస్తున్న శిక్ష ఇదేనా? జనాభాను నియంత్రించినందుకు మా రాజకీయ ఉనికినే తుడిచేస్తారా? అంటూ సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రంపై ఫైర్ అయ్యారు. 50శాతం సీట్ల పెంపు అనేది దక్షిణాదిపై కేంద్రం వదులుతున్న ఫైనల్ బుల్లెట్ అన్న ఆయన.. ఉత్తరాది పెత్తనాన్ని పెంచి, దక్షిణాది గళాన్ని నొక్కేసే కుట్ర అని విమర్శించారు. దేశంలో త్వరలో జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింద. ఢిల్లీలో జరుగుతున్న టీవీ9 వాట్ ఇండియా థింక్స్ టుడే సదస్సులో పాల్గొన్న ఆయన కేంద్రం తీరుపై మండి పడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 50 శాతం సీట్ల పెంపు వ్యూహాన్ని రేవంత్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. కేవలం జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు జరిగితే దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా నిర్వీర్యం అవుతాయని, ఇది దేశ మిగతా 2లో..

### 2034 వరకు తెలంగాణలోనే ఉంటా..

నియోజకవర్గాల పునర్విభజన జరిగితే.. ఇప్పుడున్నట్టుగానే ఉత్తర, దక్షిణ భారత్ మధ్య సంఖ్యలో తేడా ఉండాల్సిన అవసరం ఉందన్నారు సీఎం రేవంత్. అలా జరగకపోతే దక్షిణాది రాష్ట్రాలు తమ ప్రభావాన్ని కోల్పోతాయన్నారు. ఉత్తర, దక్షిణ భారతదేశం మధ్య బీజేపీ వివక్ష చూపుతోందని ఆరోపించారు సీఎం రేవంత్. దక్షిణాది రాష్ట్రాల నుంచి నిర్మలా సీతారామన్ మినహా ఏ ఒక్కరైనా కీలక శాఖలు చూసే వాళ్లు కేంద్ర కేబినెట్‌లో ఉన్నారా ? అని ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజన కేంద్రం అనుకున్నట్టుగానే చేస్తే దక్షిణాది రాష్ట్రాలు నామమాత్రంగా మారిపోతాయని రేవంత్ ఆందోళన వ్యక్తం చేశారు. అదే జరిగితే తాము ఢిల్లీకి రావడం కూడా వృధానే అన్నారు. డీలిమిటేషన్ అంశంపై ఆల్ పార్టీ పెట్టడాన్ని కూడా రేవంత్ తప్పుబట్టారు. నిర్ణయం తీసుకోవడానికి ముందు అఖిలపక్షం పెడితే బాగుంటుందని.. నిర్ణయం తీసుకుని తమకు చెప్పడానికి ఆల్ పార్టీ మీటింగ్ ఎందుకుని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనకు బీజేపీ ఎందుకు మిగతా 2లో..



# ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్

- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, 'హర్మూజ్' తెరిపించాల్సిన అవసరంపై ఇరువురి మధ్య చర్చ
- ఎక్స్ వేదికగా అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడి
- పశ్చిమాసియా పరిస్థితులపై చర్చించాం: మోదీ

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారంనాడు ఫోన్ చేశారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న పరిస్థితులు, హోర్ముజ్ జలసంధి తెరిపించాల్సిన అవసరంపై ఇరువురు నేతలు చర్చించారు. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లడించారు. ''అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడే ప్రధాని మోదీతో మాట్లాడారు. హర్మూజ్ జలసంధిని తెరిపించాల్సిన అవసరంతో పాటు పశ్చిమాసియాలో పరిస్థితిపై ఇద్దరూ చర్చించారు'' అని సెర్గియో గోర్ ఆ ప్రకటనలో తెలిపారు. ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై 5రోజులు దాడులు నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటన చేసిన అనంతరం ఇరాన్ కొట్టివేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ ప్రధాని మోదీకి ఫోన్ చేసి మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

### పశ్చిమాసియా పరిస్థితులపై చర్చించాం: మోదీ

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోనులో సంభాషించినట్టు ప్రధానమంత్రి మోదీ ట్వీట్ చేశారు. పశ్చిమాసియాలో పరిస్థితులపై తమ మధ్య ఉపయోగకరమైన మిగతా 2లో..



## హైదరాబాద్‌లో ఇంధన కొరత లేదు

2 లో..

- సరిపడా స్టాక్ అందుబాటులో ఉంది
- ప్రజలు ఆందోళన చెందవద్దు
- నగర సీపీ సజ్జనార్ స్పష్టం

# ఉద్యోగులకు శుభవార్త

- ప్రభుత్వ ఉద్యోగులకు ఈవీ వాహనాలపై 20% డిస్కౌంట్
- కాలుష్య రహిత రాష్ట్రమే లక్ష్యంగా పనిచేయాలి
- హైదరాబాద్‌లో కాలుష్య నివారణకు ప్రభుత్వం చర్యలు
- రూ.1,000 కోట్ల ఆదాయం నష్టమైనా ఈవీ వాహనాలు తీసుకొస్తున్నాం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

*దేశంలోని ప్రధాన నగరాలన్నీ కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యానికి వాహనాల పెరుగుదల కూడా ఒక కారణమే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కార్ మంగళవారం గుడ్‌న్యూస్ చెప్పింది.*



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 24:


హైదరాబాద్ నగరంలో వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) తీసుకువస్తున్నట్లు తెలిపారు. రూ.1000 కోట్ల ఆదాయం నష్టమైనా ఈవీ వాహనాలు తీసుకొస్తున్నామని వివరించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాలు ష్యాన్ని నివారించాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. తెలంగా ణ ప్రభుత్వంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఈవీ వాహనాలపై 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని ప్రకటించారు. తెలంగాణ కాలుష్య రహిత రాష్ట్రంగా ఉండాలని ప్రయత్నిస్తున్నామని.. అందుకోసం ఈ ప్రయత్నం తీసుకువచ్చామని మంత్రి పొన్నం తెలిపారు. ఈవీ ఆటోలతోపాటు బస్సులను సైతం తీసుకుని వస్తున్నామన్నారు. నగరాన్ని క్యూర్ చేయాలని ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ఈవీ వాహనాలకు సబ్సిడీ ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశంలోని వివిధ ప్రధాన నగరాలు.. తీవ్ర కాలుష్యంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం వల్లే ఈ విధంగా తయారవుతున్నాయని ఇప్పటికే పలు అధ్యాయనాల ద్వారా వెల్లడైంది. ఈ నేపథ్యంలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది.



# పార్టీ వీడడం ఖాయం

- జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు జగిత్యాలకు పార్టీ పెద్దలు
- పీసీసీ చీఫ్‌కు తేల్చి చెప్పిన జీవన్‌రెడ్డి
- జగిత్యాలలోని జీవన్‌రెడ్డి నివాసంలో ఆది శ్రీనివాస్, సచిన్ సావంత్‌తో కలిసి మహేశ్ కుమార్‌గౌడ్ మంతనాలు
- అధిష్ఠానం బుజ్జగింపులను తోసిపుచ్చిన సీనియర్ నేత

2 లో..





## రియల్ ఎస్టేట్ రంగంలో బడా మోసం

- నిజాంపేటలో ప్లాట్ల విక్రయం పేరిట రూ.కోట్లలో కుంభకోణం
- ఒకే ఫ్లాట్‌కి డబుల్ రిజిస్ట్రేషన్ చేయించి కొనుగోలుదారులను బురిడీ కొట్టించిన వైనం
- రంగంలోకి పోలీసులు

2 లో..

# క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సీ హోదా రద్దు

- మతం మారిన వారి హోదాకు సంబంధించి సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- హిందూ, సిక్కు, బౌద్ధ మతాలు కాకుండా ఇతర మతాల్లోకి మారితే ఎస్సీ హోదా వర్తించదని స్పష్టం



న్యూఢిల్లీ: మతం మారిన వారి ఎస్సీ హోదాకు సంబంధించి సుప్రీం కోర్టు తాజాగా కీలక తీర్పు వెలువరించింది. క్రిస్టియన్ మతంలోకి మారాక ఎస్సీ హోదా ఉండదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలు కాకుండా ఇతర మతాల్లోకి మారితే ఎస్సీ హోదా వర్తించదని సర్వోన్నత మిగతా 2లో..

# అందరి సహకారంతో హైదరాబాద్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుదాం

- నగర అభివృద్ధి, ప్రాజెక్టుల అమలుపై అసెంబ్లీలో సుదీర్ఘ చర్చ
- బీఆర్ఎస్ సభ్యుల ప్రశ్నకు మంత్రి శ్రీధర్ బాబు సమాధానం
- మూసీ విషయంలో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని విమర్శ
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 24:

అందరి సహకారంతో హైదరాబాద్ నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. నగర అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యలు, ప్రాజెక్టుల అమలు అంశాలపై శాసనసభలో సుదీర్ఘ చర్చ జరిగింది. ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ సభ్యుల ప్రశ్నకు ముఖ్యమంత్రి తరపున మంత్రి శ్రీధర్ బాబు సమాధానం ఇచ్చారు. హైదరాబాద్ అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రెండేళ్లలో కేవలం రూ.122 కోట్లు ఖర్చు చేస్తే పనులు ఎప్పుడు పూర్తవుతాయని ప్రశ్నించారు. వారి వ్యాఖ్యలపై స్పందించిన శ్రీధర్‌బాబు.. మూసీ విషయంలో మిగతా 2లో..

''హైదరాబాద్‌లో పనుల కోసం 2026-27లో రూ.2250 కోట్లు ఖర్చు చేస్తాం. మనవళ్ల వరకు చూడాల్సిన అవసరం లేదు వచ్చే ఎన్నికల నాటికి గణనీయమైన పురోగతి సాధిస్తాం. మూసీ విషయంలో మంచి ఆలోచనతో ఉన్నప్పటికీ బీఆర్ఎస్ రాజకీయం చేస్తోంది. హైదరాబాద్ భారీగా వలసలు కొనసాగుతున్నాయి. ట్రాఫిక్ సమస్యపై పెద్ద ఎత్తున దృష్టి సారిస్తున్నాం. అందులో భాగంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చేస్తున్నాం.''

\- మంత్రి శ్రీధర్ బాబు



## పెట్రోల్ నో స్టాక్

- హైదరాబాద్‌లోని పలు బంకుల్లో పెట్రోల్ లేదని దర్శనమిస్తున్న బోర్డులు
- రిఫైనరీల నుంచి ఇంధన సరఫరా సక్రమంగా జరుగుతోందన్న పౌరసరఫరాలశాఖ
- వదంతుల వల్లే ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద క్యూలైన్లు పెరిగాయని వెల్లడి
- ప్రజలు భయపడి అనవసర కొనుగోలు చేస్తున్నారని వ్యాఖ్య

2 లో..

సంపుటి: 1 సంచిక: 297 వార్త వేదిక సూర్య || బుధవారం, 25 మార్చి, 2026 ||

# దక్షిణాదిపై డీలిమిటేషన్ కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

సమాఖ్య స్ఫూర్తికే విరుద్ధమని ఫైర్ అయ్యారు. ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం సీట్లు పెంచితే.. తమిళనాడు, పుదుచ్చేరి కలిపి ఉన్న 40 స్థానాలు 60కి చేరుతాయి. కానీ అదే సమయంలో ఉత్తరప్రదేశ్‌లో సీట్ల సంఖ్య ఏకంగా 160కి పెరుగుతుందని అన్నారు. ఈ వ్యూహం వెనుక ఉన్న అసలు ఉద్దేశం దక్షిణాది రాష్ట్రాల అవసరం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అని రేవంత్ ఆరోపించారు. ''50 శాతం పెంపు అనేది దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ఉనికిపై కేంద్రం వదులుతున్న ఫైనల్ బుల్లెట్'' అని ఆయన అభివర్ణించారు.



### అభివృద్ధికి శిక్షా? జనాభా నియంత్రణే శాపమా?

దక్షిణాది రాష్ట్రాలు దశాబ్దాలుగా కేంద్రం పిలుపు మేరకు జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశాయని, ఇప్పుడు అదే జనాభా ప్రాతిపదికన సీట్లు తగ్గిస్తే అది మా అభివృద్ధికి ఇచ్చే శిక్షా? అని రేవంత్ ప్రశ్నించారు. ఉత్తర భారతాన్ని గెలిస్తే చాలు అన్న చందంగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, దీనివల్ల దక్షిణాది రాష్ట్రాల నేతలకు జాతీయ రాజకీయాల్లో చోటు లేకుండా పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ హయాంలో టాప్ 10 అత్యున్నత పదవుల్లో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వారికి చోటు దక్కలేదని ఆయన గుర్తు చేశారు. నియోజకవర్గాల పెంపుపై అటెండర్ నుంచి రాష్ట్రపతి వరకు చర్చ జరగాలని, ఏకపక్ష నిర్ణయాలు చెల్లవని రేవంత్ స్పష్టం చేశారు. డి-లిమిటేషన్ వల్ల కలిగే నష్టాలపై దక్షిణాది రాష్ట్రాలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల ప్రచారంలో ఈ అంశాన్ని ప్రధాన అస్త్రంగా మార్చుకుంటామని, దక్షిణాది పట్ల కేంద్రం చూపుతున్న వివక్షను ప్రజలకు వివరిస్తామని ప్రకటించారు.

### 2034 వరకు తెలంగాణలోనే ఉంటా..

అడ్డుపడుతోందని ప్రశ్నించారు సీఎం రేవంత్. గుజరాత్‌లో వాళ్లు సబర్మతి సుందరీకరణ చేపట్టలేదా అని కామెంట్ చేశారు. గ్యారంటీ హామీల విషయంలో తమకు పూర్తి స్పష్టత ఉందన్నారు సీఎం రేవంత్. అందుకే రాష్ట్ర పరిస్థితిని ప్రజలకు వివరిస్తున్నామన్నారు. గుజరాత్ మోడల్‌పై సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు. మోదీ ప్రధానిగా ఉన్నప్పటికీ గుజరాత్ గురించే ఆలోచిస్తున్నారని.. ఆ ప్రాంతానికే ఎక్కువగా రాయితీలు ఇచ్చి పెట్టుబడులు తీసుకెళుతున్నారని ఆరోపించారు.

2034వరకు తెలంగాణలోనే ఉంటానంటూ పరోక్షంగా అప్పటివరకు తానే తెలంగాణ సీఎం అని సంకేతాలు ఇచ్చారు సీఎం రేవంత్. ఆ తరువాత పార్టీ తనకు ఎక్కడ ఏ బాధ్యతల అప్పగిస్తే అక్కడికి వెళతానని తెలిపారు. తాను హీరోను కాదన్నారు సీఎం రేవంత్. అయితే తనను హీరోను చేసింది మాత్రం తెలంగాణ ప్రజలే అని తెలిపారు. బలవంతులతో పోరాడినప్పుడు ప్రజలు తనకు అండగా నిలిచారన్నారు. ప్రధాని మోదీ చెబుతున్నట్టుగా 2047 లక్ష్యాన్ని తాను నిర్దేశించుకోవడంలో తప్పేముందన్నారు సీఎం రేవంత్. తాము అనేక సంస్థల నుంచి ఇన్‌పుట్‌లు తీసుకుంటున్నామన్నారు. తాను కార్యకర్తల కోసం ఆలోచించే నాయకుడినని అన్నారు సీఎం రేవంత్. కార్యకర్తలు తమ కోసం సర్వం త్యాగం చేస్తారని.. అందుకే తాను వారి గురించి ఆలోచిస్తానని స్పష్టం చేశారు. కేసీఆర్ తనకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమే అన్నారు సీఎం రేవంత్. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య అంతరాన్ని మరింతగా పెంచే ప్రయత్నాలను విరమించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల నిష్పత్తిలోనే నియోజకవర్గాలను పెంచాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న స్థానాలకు 50 శాతం సీట్లు పెంచుతూ లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ చేపడితే, రేపటి రోజున జాతీయ రాజకీయాల్లో దక్షిణాది రాష్ట్రాల పాత్ర ఉండదని విశ్లేషించారు. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో దక్షిణాది రాష్ట్రాల ప్రమేయం లేకుండా పోతుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. టీవీ9 నెట్‌వర్క్ ఆధ్వర్యంలో 'భారతదేశం-ప్రపంచం' అన్న ఇతివృత్తంపై "వాట్ ఇండియా థింక్స్ టుడే" సమ్మిట్ 2026 లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన, మూసీ నది ప్రక్షాళన, తెలంగాణ విజన్ 2047, పరిపాలన, రాజకీయ స్థితిగతులపై అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో 50 శాతం మేరకు సీట్లను పెంచాలన్న నిర్ణయం ఏ ప్రాతిపదికన చేశారని ప్రశ్నించారు. ఈ ప్రక్రియ వల్ల ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య అంతరాన్ని పెంచుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై తొలుత అఖిల పక్ష సమావేశం నిర్వహించి అందరి అభిప్రాయం మేరకు మార్గదర్శకాలు రూపొందించాల్సిందని అన్నారు. అలా కాకుండా ముందే నిర్ణయం తీసుకుని, తర్వాత అందరి అభిప్రాయాలు అడగడటం సమంజసం కాదన్నారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం ఉండాలనే మేం కోరుకుంటున్నామని చెప్పారు. ఉత్తరాదిలోని పెద్ద రాష్ట్రాలే కేంద్రంలో ప్రభుత్వాలను ఏర్పాటు చేయగలుగుతాయని, దక్షిణాది రాష్ట్రాలు వివక్షకు గురికావడమే కాకుండా తీరని నష్టం జరుగుతుందని అన్నారు. మంచి ఎక్కడున్నా స్వీకరిస్తామని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు హైదరాబాద్‌కు మూడు బుల్లెట్ ట్రెయిన్లు ఇచ్చినందుకు వారికి కృతజ్ఞతలు చెప్పానని గుర్తుచేశారు. దేశంలో గ్యాస్, పెట్రోల్ కొరత సమస్యను ఎదుర్కొనడానికి కార్యాచరణ ప్రకటించాలని కోరారు.

### కేసీఆర్‌తో నాకున్న బంధం ఇదే..

కేసీఆర్ కుటుంబంపై సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో టీవీ9 వాట్ ఇండియా థింక్స్ టుడే సదస్సులో పాల్గొన్న ఆయన.. కేసీఆర్‌తో తనకు ఎటువంటి వ్యక్తిగత కక్షలు లేవని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ చీఫ్ కేవలం రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని అన్నారు. కేసీఆర్ కుటుంబంలో పదవుల కోసం అంతర్గత యుద్ధం జరుగుతోందని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ''కేసీఆర్ ఎదుర్కొంటున్నది రాజకీయ సమస్య కాదు, అది పూర్తిగా వారి కుటుంబ సమస్య. పదవుల కోసం కేటీఆర్, కూతురు పోటీ పడుతున్నారు. గతంలో హరీష్ రావు ముఖ్యమంత్రి అవుతారన్న చర్చ కూడా అందుకే వచ్చింది'' అని విమర్శించారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై కేటీఆర్ మాట్లాడితే, బడ్జెట్‌పై హరీష్ రావు మాట్లాడుతున్నారని.. వారి మధ్య సమన్వయం లేదని వేలెత్తి చూపారు.

బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో ఉనికి కోల్పోతోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుండు సున్నా వచ్చిందని, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కూడా ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సమయంలో కేటీఆర్ బెట్టింగులు కట్టించారని, అయినా అక్కడ ఓటమి తప్పలేదని రేవంత్ ఆరోపించారు. ''నా లెక్క ఎప్పుడూ ఒకటే.. ఒక దెబ్బకు రెండు పిట్టలు.. వచ్చే ఎన్నికల్లో అటు బీఆర్ఎస్‌ను, ఇటు బీజేపీని రెండింటినీ ఓడించి తీరుతాం'' అని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉన్న సంప్రదాయం ప్రకారం.. ప్రజలు తనకు 2024 నుంచి 2034 వరకు అవకాశం ఇస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం కేసీఆర్ కనీసం ప్రతిపక్ష పాత్రనైనా సరిగ్గా పోషించాలని హితవు పలికారు.



# ఫార్ములా ఈ-రేస్ కేసు ముమ్మాటికీ లొట్టపీసు కేసే

- ఎక్కడా క్విడ్ ప్రో కో జరగలేదు
- నగదు బదిలీ కేవలం బ్యాంక్ టు బ్యాంక్ మాత్రమే జరిగింది
- డబ్బులు ఇంకా ఆ కంపెనీ దగ్గరే ఉన్నాయి
- ఛార్జ్‌షీట్లో ఆ కంపెనీ పేరు ఎందుకు లేదు?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్న

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 24:

ఫార్ములా ఈ రేస్ కేసు ముమ్మాటికీ ఒక లొట్టపీసు కేసేనని బీఆ రఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. అసెంబ్లీలో మీడి యాతో చిట్ చాట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలపై ప్రైవేట్ మెంబర్ బిల్లు నుండి ప్రజలను డైవర్ట్ చేసేందుకే ఫార్ములా ఈ రేస్ కేసు తెరపైకి తెచ్చారని ఆరోపించారు. ఎక్కడా నిధుల దుర్వినియోగం జరగలేదు, లేని కేసు ఉన్నట్టుగా చూపి మసి పూసి మారేడు కాయ చేస్తున్నారని మండిపడ్డారు. అది ముమ్మాటికి లొట్టపీసు కేసేనని, ఎక్కడా క్విడ్ ప్రో కో జరగలేదన్నారు కేటీఆర్. బ్యాంక్ టు బ్యాంక్ నగదు బదిలీ జరిగింది, డబ్బులు ఇంకా ఆ కంపెనీ దగ్గరే ఉన్నాయి, ఛార్జ్ షీట్లో ఆ కంపెనీ పేరు ఎందుకు లేదు..? అని కేటీఆర్ ప్రశ్నించారు. మేము నిర్వహించిన ఫార్ములా ఈ రేస్ వల్ల రూ.700 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రేవంత్ రెడ్డి రూ.200 కోట్లు ఖర్చు చేసి మిస్ వరల్డ్ పోటీలు పెడితే, ప్రపంచం ముందు మన తెలంగాణ పరువు పోయిందన్నారు. నన్ను వేశ్య లాగా చూశారని మిల్లా మ్యాగీ ఇంటర్వ్యూలో చెబితే, దాని మీద ఎలాంటి విచారణ లేదన్నారు. అక్రమ కేసులకు మేము భయపడము, న్యాయస్థానాలను ఆశ్రయిస్తాం, మాకు న్యాయం జరుగుతుంది. అన్నీ నా నిర్ణయాల ప్రకారమే జరిగాయని చెప్తున్నాను కదా, అధికారులను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు కేటీఆర్.

# క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సీ హోదా రద్దు

(మొదటి పేజీ తరువాయి)

న్యాయస్థానం స్పష్టం చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన ధర్మసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. గుంటూ రు జిల్లా పిట్టలవానిపాలెంలో పాస్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తిపై దాడికి సంబంధించి ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసులో సుప్రీం కోర్టు ఈ తీర్పు వెలువరించింది. ఫిర్యాదుదారుడు దశాబ్ద కాలంగా పాస్టర్‌గా ఉంటున్నారని, ఘటన జరిగిన సమయంలోనూ ప్రార్థనలు చేస్తున్నారని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. క్రైస్తవ మతంలో కుల వ్యవస్థకు తావులేదని, కాబట్టి అట్రాసిటీ చట్టం కింద ఫిర్యాదు చేసే హక్కు ఉండదని పేర్కొంది. ఫిర్యాదుదారుడికి తహశీ ల్దార్ ఇచ్చిన కుల ధ్రువీకరణ పత్రం ఉన్నప్పటికీ, మత మార్పిడి తర్వాత ఆ రక్షణ పొందేందుకు అర్హత ఉండదని సర్వోన్నత న్యాయ స్థానం వెల్లడించింది. క్రైస్తవ మతంలోకి మారి, ఆ ఆచారాలను పాటిస్తున్న వ్యక్తి షెడ్యూల్డ్ కుల సభ్యుడిగా కొనసాగలేరని స్పష్టం చేసింది. రాజ్యాంగం (షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్, 1950 ఈ విష యాన్ని స్పష్టం చేస్తోందని సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది. క్రైస్తవ మతంలోకి మారిన వ్యక్తికి ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ నిరోధక) చట్టం కింద రక్షణ లభించదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

# ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్

(మొదటి పేజీ తరువాయి)

చర్చ జరిగిందన్నారు. వీలైనంత త్వరలో ఉద్రికతలు తొలగేందుకు, శాంతి పునరుద్ధరణకు భారత్ మద్దతు ఉంటుందని తాను స్పష్టం చేసినట్టు పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధి తెరవడం, రక్షణ కల్పించడం, అందరికి అందుబాటులోకి తేవడం యావత్ ప్రపంచానికి అవసరమని పేర్కొన్నారు.

# ఇంధన కొరత లేదు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 24:

హైదరాబాద్‌లో ఇంధనం, ఎల్పీజీ కొరత లేదని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ చెప్పారు. సరిపడా స్టాక్ అందుబాటులో ఉందని.. నగర వ్యాప్తంగా సరఫరా సజావుగా కొనసాగుతోందని వెల్లడించారు. పౌరులు ఆందోళన చెందవద్దని, రూమర్స్ నమ్మొద్దని, వ్యాప్తి చేయొద్దని కోరారు. హైదరాబాద్ నగరంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత ఉందంటూ వస్తున్న వార్తలపై సజ్జనార్ స్పందించారు. నగరంలో ఇంధన నిల్వలు నిండుకున్నాయనేది కేవలం అపోహ మాత్రమేనని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. నగరవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీల దగ్గర సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా ఎక్కడా ఆగిపోలేదని సీపీ తెలిపారు. కొరత ఉందన్న ఆందోళనతో పెట్రోల్ బంక్‌ల వద్ద భారీగా క్యూ కట్టవద్దని, అనవసరంగా ఇంధనాన్ని నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించవద్దని ఆయన పౌరులకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సిటీ పోలీస్ యంత్రాంగం ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని, రవాణా సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను వదంతులను నమ్మవద్దని, వాటిని ఇతరులకు షేర్ చేయవద్దని సీపీ హెచ్చరించారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని సూచించారు. నగరంలో సాధారణ పరిస్థితులు కొనసాగేందుకు ప్రజలందరూ సహకరించాలని సీపీ కోరారు. రద్దీ వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బంక్‌ల వద్ద బారులు తీరవద్దని సూచించారు.

# రియల్ ఎస్టేట్ రంగంలో బడా మోసం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 24:

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో మరో భారీ మోసం వెలుగుచూసింది. నిజాంపేట పరిధిలో ఫ్లాట్ల విక్రయం పేరిట రూ.కోట్లలో కుంభకోణం జరిగింది. దీనిపై రంగంలోకి దిగిన సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ అధికారులు.. మోసాలకు పాల్పడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితులు, పోలీసులు వివరాల ప్రకారం.. నిజాంపేటలోని విలువైన భూమిలో నిర్మించిన ఫ్లాట్లను ఒకరి కంటే ఎక్కువ మందికి విక్రయించి (డబుల్ రిజిస్ట్రేషన్), అమాయక కొనుగోలుదారులను బురిడీ కొట్టించిన ముఠాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈ కేసులో ప్రభుత్వ అధికారుల హస్తం కూడా ఉండటం గమనార్హం. బాధితుల ఫిర్యాదు మేరకు సైబరాబాద్ EOW పోలీసులు నిడమర్తి శివప్రసాద్, నవీన్‌కుమార్ గోయల్, నరేంద్రకుమార్ మోదీ, శశి కాంత్ మోదీలపై కేసు నమోదు చేశారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్లకు సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్‌పై కూడా కేసులు నమోదయ్యాయి. నిందితులు పక్కా పథకం ప్రకారం ఈ మోసానికి పాల్పడ్డారు. నిజాంపేటలోని 3 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఫ్లాట్లను గతంలోనే కొందరు వ్యక్తులకు విక్రయించారు. ఆ ఫ్లాట్లు అప్పటికే అమ్ముడైన విషయాన్ని గోప్యంగా ఉంచి, మోటూరి శ్రీనివాస్ ప్రసాద్, సూర్యకమల్ ప్రసాద్‌లను సంప్రదించారు. బాధితుల నుంచి రూ.15.26 కోట్లు వసూలు చేసి, అదే ఫ్లాట్లను వీరికి మళ్లీ రిజిస్ట్రేషన్ చేశారు. అప్పటికే విక్రయించిన ఆస్తులను మళ్లీ తమకు అమ్మినట్లు గుర్తించిన బాధితులు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు రంగంలోకి దిగి ఈ కేసును సీరియస్‌గా తీసుకుని సమగ్ర దర్యాప్తు చేపట్టారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని పాత రికార్డులను, నిందితుల బ్యాంకు ఖాతాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.





# పార్టీ వీడడం ఖాయం

- జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు జగిత్యాలకు పార్టీ పెద్దలు
- పీసీసీ చీఫ్‌కు తేల్చి చెప్పిన జీవన్‌రెడ్డి
- జగిత్యాలలోని జీవన్‌రెడ్డి నివాసంలో ఆది శ్రీనివాస్, సచిన్ సావంత్‌తో కలిసి మహేశ్ కుమార్‌గౌడ్ మంతనాలు
- అధిష్ఠానం బుజ్జగింపులను తోసిపుచ్చిన సీనియర్ నేత

జగిత్యాల, (వార్త వేదిక సూర్య)-మార్చి 24:

తాను కాంగ్రెస్ పార్టీని వీడడం ఖాయమని తెలంగాణ మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం జగిత్యాలలోని జీవన్ రెడ్డి నివాసంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌తో కలిసి పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ జీవన్ రెడ్డితో జరిపిన మంతనాలు విఫలమయ్యాయి. అధిష్ఠానం బుజ్జగింపులను ఆయన తోసిపుచ్చినట్లు తెలుస్తోంది. పార్టీకి రాజీనామా చేసే నిర్ణయానికి తాను పూర్తిగా కట్టుబడి ఉన్నట్లు ఈ సందర్భంగా వారికి జీవన్ రెడ్డి స్పష్టం చేసినట్లు సమాచారం. అలాగే బుధవారం జగిత్యాలలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు జీవన్ రెడ్డి సన్నాహాలు చేస్తున్నారు. దాదాపు 5 వేల మంది కార్యకర్తలతో ఆయన ఈ సభ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ సభా వేదిక మీద నుంచి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు జీవన్ రెడ్డి ప్రకటిస్తారనే చర్చ సైతం సాగుతోంది. కాంగ్రెస్ పార్టీలో తనకు జరుగుతున్న వరుస అవమానాలను.. జీవన్ రెడ్డి ఇప్పటికే వివిధ వేదికల ద్వారా బహిరంగంగా వివరించారు. ఈ నేపథ్యంలో పార్టీని వీడడానికి ఆయన సిద్ధపడినట్లు తెలుస్తోంది. తన రాజకీయ భవిష్యత్తుపై త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటానని జీవన్ రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. పార్టీకి రాజీనామా చేస్తానని జీవన్ రెడ్డి ప్రకటించిన తేదీ సమీపించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం రంగంలోకి దిగింది. జీవన్ రెడ్డిని బుజ్జగించి దారికి తెచ్చుకోవాలని భావించింది. అందుకోసం పార్టీలోని కీలక నేతలను రంగంలోకి దింపి మంతనాలు జరిపింది. కానీ జీవన్ రెడ్డి మాత్రం తన పట్టు వీడలేదు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం తథ్యమని వారికి జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

# అందరి సహకారంతో హైదరాబాద్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుదాం

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని అన్నారు. రూ.16 వేల కోట్లతో నగరంలో పనులు చేస్తున్నట్లు చెప్పారు. హెచ్-సిటీ కింద రూ.7,032 కోట్ల అంచనాతో 26 పనులతో పాటు రూ.1,500 కోట్లతో 49 లింక్ రోడ్లు, రూ.7,406 కోట్లతో మూడు ఎలివేటెడ్ కారిడార్లకు ఆమోదం ఇచ్చినట్టు వెల్లడించారు. అలాగే, 2026-27లో రూ.2,250కోట్లు ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మూసీపై ఈస్ట్-వెస్ట్ కారిడార్ అభివృద్ధి చేస్తే రద్దీ తగ్గుతుందని సూచించారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పనులను కాంగ్రెస్ తమవిగా చెప్పుకుంటోందని తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. అభివృద్ధి నిధులు ఇవ్వడం లేదని, ప్రొటోకాల్ పాటించడం లేదని అన్నారు. జవహర్ నగర్ డంప్ యార్డ్ సమస్యను ప్రస్తావించిన మల్లారెడ్డి ఆ ప్రాంతానికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు గత ప్రభుత్వం ప్రారంభించిన పనులను ఎక్కడా ఆపలేదని పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం..!

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 24: హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. వాతావరణ కేంద్ర సూచించిన ట్టే గత రెండు రోజులోగా చల్లబడిన వాతావరణం.. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా మేఘావృ తమైంది. ఈదురు గాలులతో పాటు వర్షం జోరుగా కురిసింది. మాధాపూర్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ, రాయదుర్గం, యూసుఫ్ గూడ వంటి ప్రాంతాల్లో దంచి కొడుతోంది. దాంతో, ఆఫీస్ నుంచి ఇంటికి బయల్దేరిన చాలామంది ఎక్కడిక్కడే చిక్కుకుపోయారు. గత రెండు రోజులుగా పలు జిల్లాల్లో వడగళ్ల వాన కురిసింది. కామారెడ్డిలో చిన్న చిన్న రాళ్ల పరిమాణంలో వడగళ్ల వాన పడింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌నూ మంగళవారం వరుణుడు పలకరించాడు. ఒక్కసారిగా వాతావరణం చల్లబడడమే ఆలస్యం చినుకులు మొదలయ్యాయి. మాధాపూర్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ, రాయదుర్గం, యూసుఫ్ గూడ, జగద్గిరిగుట్ట, షాపూర్, చింతల్, బేగంపేట్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మారేడ్‌పల్లిలో వర్షం దంచేస్తోంది. భారీగా వర్షం పడుతుండంతో పలు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించిపోయింది.

# భూపాలపల్లిలో ఐదేండ్ల చిన్నారిపై ఇద్దరు బాలుర లైంగిక దాడి

జయశంకర్ భూపాలపల్లి, (వార్త వేదిక సూర్య)-మార్చి 24: జయశంకర్ భూపాలపల్లిలో దారుణం చోటు చేసుకుంది. ఐదేండ్ల చిన్నారిపై ఇద్దరు బాలురు లైంగిక దాడికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే..కాటారం డివిజన్ పరిధిలోని మహదేవపూర్ ప్రాంతంలో ఇంటిముందు ఆడుకుంటున్న చిన్నారిని ఎత్తుకెళ్లి బాలురు పక్కన ఉన్న పార్కులోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. తీవ్ర అస్వస్థతకు గురైన బాలికను దల్లిదండ్రులు చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని పోక్సో కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పెట్రోల్ నో స్టాక్

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 24:

పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్ సరఫరాపై చూపింది. దీంతో జిల్లాలో వాణిజ్య గ్యాస్ కొరత ఏర్పడగా, గృహావసర గ్యాస్‌పై పరిమితులు నెలకొన్నాయి. ఇక పెట్రోల్ బంకుల్లో చమురు నిల్వలు లేక మూతపడుతున్నాయి. మంగళవారం సాయంత్రం నుంచి హైదరాబాద్ నగరంలోని పలు బంకుల్లో పెట్రోల్ లేదని బోర్డులు దర్శనమిస్తున్నాయి. దీంతో కిలో మీటర్ మేర బైక్‌లు, కార్లు, ఆటోలు క్యూ కడుతున్నాయి. పెట్రోల్ దొరకదన్న పుకార్లతో మంగళవారం రాత్రి వరకు దాదాపు నగరమంతా క్యూలైన్లు కనిపిస్తున్నాయి.

### ఎక్కడా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, ఎల్పీజీ కొరత లేదు: పౌర సరఫరాల శాఖ

పెట్రోల్ బంకుల వద్ద తాజా పరిస్థితులపై తెలంగాణ ప్రభుత్వ పౌరసరఫరాల శాఖ స్పందించింది. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్ లేదా వంట గ్యాస్ - ఎల్పీజీ కొరత ఏ మాత్రం లేదని స్పష్టం చేస్తోంది. అన్ని ఆయిల్ రిఫైనరీల నుంచి స్థానిక డిపోల వరకు ఇంధన సరఫరా యంత్రాంగం పూర్తిగా, సక్రమంగా పని చేస్తోందని, అన్ని జిల్లాల్లోని ప్రజల రోజువారీ అవసరాలను తీర్చడానికి సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేసింది.

సంపుటి 1 సంచిక 298 వార్త వేదిక సూర్య
హైదరాబాద్ బుధవారం, మార్చి 25, 2026




# ప్రజల సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యం

## మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక నరేష్



సికింద్రాబాద్, మార్చి 24(వార్త వేదిక సూర్య)

ప్రజల సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమని మోండా మార్కెట్ డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శివాజి నగర్ లో పర్యటించి గత కొన్ని రోజులుగా అక్కడ ఉన్న బస్తీ వాసులు మురుగు నీటి కాలువ కు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ మేనేజర్, సీసీ రోడ్డు కాంట్రాక్టర్‌ను సందర్శించి సమన్వయం చేసుకుని కొత్త రోడ్డు వేయకముందే కొత్త మ్యాన్‌హోల్‌ను పెంచాలని అధికారాలు సూచించారు. అతి త్వరలోనే చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మురుగునీటి సమస్యను పరిష్కారం చేస్తానని మాజీ కార్పొరేటర్ హామీ ఇచ్చారు. అదేవిధంగా మారుతీవీధిని సందర్శించి పౌరసమస్యలపై చర్చించారు, రోడ్డు తవ్వినందున ఎం10 లేయర్ వేయకముందే సమస్యను పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.



## టీబీ రహిత సమాజం నిర్మాణం మనందరి బాధ్యత : డాక్టర్ లలితాదేవి

మైలర్ దేవ్ పల్లి, మర్చి 24 ( వార్త వేదిక సూర్య ) :



మనసురాబాద్ జిల్లా క్షయ నియంత్రణ కార్యాలయంలో మంగళవారం వరల్డ్ టీబీ డే సందర్భంగా విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీబీ ముక్త భారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరం మార్చి 24న వరల్డ్ టీబీ డే నిర్వహించబడుతుంది. క్షయవ్యాధి కారక జీవాణువును కనుగొన్న శాస్త్రవేత్త రాబర్ట్ కోచ్ పుట్టినరోజు సందర్భంగా ఈ దినాన్ని జరుపుకుంటారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ లలితాదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అదనపు వైద్యాధికారి డాక్టర్ పాపారావు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ , ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, భారతదేశంలో టీబీ నియంత్రణలో తెలంగాణ రాష్ట్రం రెండవ స్థానంలో నిలవడం గర్వకారణమని తెలిపారు. టీబీ రోగులను గుర్తించి వారికి ఉచిత చికిత్స అందించడం, పోషకాహారం అందించే పథకాలు అమలు చేయడం జరుగుతోందని వివరించారు. ఈ కార్యక్రమం లో ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గీత, డాక్టర్ అమితా, డాక్టర్ అయేషా ,అలాగే జిల్లా కార్యక్రమ పర్యవేక్షకుడు శ్రీనివాస్, జిల్లా ప్రజా కార్యక్రమ నిర్వహణ అధికారి విజయకుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, టీబీ అలర్ట్ ఇండియా, అపోలో టైర్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు

## బకాయిలు చెల్లించనందుకు బ్యాంక్వెట్ హాల్ సీజ్: అత్తాపూర్ జిహెచ్ఎంసి అధికారుల చర్య

మైలర్ దేవ్ పల్లి, మర్చి 24 ( వార్త వేదిక సూర్య ) :



అత్తాపూర్ సర్కిల్--20 పరిధిలో ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిల వసూళ్లలో జీహెచ్ఎంసీ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. రాజేంద్రనగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య మరియు అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్ నిర్మల ఆధ్వర్యంలో మంగళవారం ఎం.ఎం పహాడి ప్రాంతంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

ఈ డ్రైవ్‌లో భాగంగా ఎం.ఎం క్యూ బ్యాంక్వెట్ హాల్ (డోర్ నెం: 4-10-33/2/పి హెచ్/2) యజమాని సయ్యద్ అయూబ్ అలీ హుస్సేన్‌కు చెందిన వాణిజ్య ఆస్తిపై □11,39,149 ప్రాపర్టీ పన్ను బకాయిలు ఉండటంతో ఆస్తిని అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వం బకాయిలపై వడ్డీపై 90% రాయితీ కల్పించినందున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పన్నులను వెంటనే చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఐ హరికిషన్ సహా ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అత్తాపూర్ సర్కిల్‌లో ముమ్మరంగా 'పట్టణ ప్రణాళిక'

# పారిశుద్ధ్య పనులు






### గార్బేజ్ పాయింట్ల తొలగింపు.. ఇంటింటికీ వెళ్లి అవగాహన

### పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, అధికారులు




మైలర్ దేవ్ పల్లి, మర్చి 24 ( వార్త వేదిక సూర్య ) :

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజా పాలన - పట్టణ ప్రణాళిక'లో భాగంగా అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం సర్కిల్ వ్యాప్తంగా భారీ శానిటేషన్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది కలిసి ప్రజల్లో పారిశుద్ధ్యంపై చైతన్యం కల్పించారు. సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏళ్ల తరబడి పేరుకుపోయిన గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను శానిటేషన్ వర్కర్లు, ఆర్పీలు, ఎస్ఎఫ్ఏలు, ఎస్ఎస్‌లు మరియు సీఓలు సమన్వయంతో గుర్తించి పూర్తిగా తొలగించారు. అత్తాపూర్ గ్రేవ్‌యార్డ్, మల్లయ్య టవర్స్ వెనుక ప్రాంతం, హైదర్‌గూడ్ ఎర్రబోడ మెయిన్ రోడ్, సులేమాన్‌నగర్ పిల్లర్ నం. 207, శాస్త్రిపురం హెచ్‌కేజీఎన్ ఫర్నిచర్ రోడ్, కట్టేదాన్ మెహ్ఫిల్ పాయింట్, మైలార్‌దేవ్‌పల్లి రామకృష్ణ జంక్షన్ వంటి ప్రధాన కూడళ్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చెత్తను తరలించారు. ఎస్.ఏ.టి ఆటోలకు చెత్త ఇవ్వని ఇళ్లను అధికారులు స్వయంగా సందర్శించారు. ప్రతిరోజూ ఇంటి వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని వివరించారు. రోడ్లపై చెత్త వేయడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈఈ (ఎస్ డబ్ల్యూ ఎం) తిరుపతి, ఏఈ అశీష్ మరియు ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మైలర్ దేవ్ పల్లిలో ఉచిత వైద్య శిబిరం: 476 మందికి పరీక్షలు

### - ప్రజల చెంతకే నాణ్యమైన వైద్యం: డి.వై.డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ విజయ పూర్ణిమ

మైలర్ దేవ్ పల్లి, మర్చి 24 ( వార్త వేదిక సూర్య ) :



ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మైలర్ దేవ్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉచిత హెల్త్ క్యాంప్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంప్‌కు స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి డీ వై డీ ఎం హెచ్ ఓ డాక్టర్ విజయ పూర్ణిమ ముఖ్య అతిథిగా హాజరై క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయడం కోసం ఇలాంటి ఉచిత హెల్త్ క్యాంప్‌లు ఎంతో ఉపయోగకరమని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ ఇలాంటి శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు ప్రత్యేకంగా సేవలు అందించారు. డెంటల్ సమస్యలతో బాధపడుతున్న 52 మందికి చికిత్స అందించగా, మహిళల ఆరోగ్య సమస్యలపై 84 మందికి పరీక్షలు నిర్వహించారు. జనరల్ ఫిజికల్ పరీక్షల కోసం 134 మందికి . ఐ టెస్ట్ ద్వారా 77 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన సూచనలు ఇచ్చారు. ఆర్థోపెడిక్ సమస్యలు, ముఖ్యంగా కీళ్ల నొప్పులతో బాధపడుతున్న 60 మందికి ప్రత్యేక వైద్య సేవలు అందించారు. చిన్నపిల్లల ఆరోగ్య సమస్యలతో వచ్చిన 70 మందికి కూడా వైద్యులు పరీక్షలు చేసి తగిన చికిత్స అందించారు. మొత్తం 476 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రేఖ, హెల్త్ ఆఫీసర్ చెన్న కేశవ్, ఎస్‌వో నారాయణ, సూపర్వైజర్లు సురేఖ, రాజేష్, కన్న, యూపీహెచ్ పాల్గొన్నారు.



## శాస్త్రిపురం 'దక్షిణ అయోధ్య'లో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం

### మార్చి 27న వైభవంగా వేడుకలు.. ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

### భక్తులకు భస్మ హిల్స్ మట్టి, అంజనాద్రి సింధూరం పంపిణీ

మైలర్ దేవ్ పల్లి, మర్చి 24 ( వార్త వేదిక సూర్య ) :


శ్రీ సీతారామ కళ్యాణ మరియు జన్మోత్సవ ఆహ్వాన పత్రిక
Scan for Location
అయోధ్యానాథ్ దేవాలయం, శాస్త్రిపురం, భాగ్యనగర్.
8106138856, 9502750699, 9121392943, 7207700759

రామనామ స్మరణతో రాజేంద్రనగర్ పులకించనుంది. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని శాస్త్రిపురంలో వెలసిన అత్యంత మహిమాన్విత క్షేత్రం శ్రీ అయోధ్యనాథ్ మందిరంలో ఈనెల 27వ తేదీ, శుక్రవారం నాడు శ్రీ సీతారామ కళ్యాణ మరియు జన్మోత్సవ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సర్వం సిద్ధం చేసింది. ఈ ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. భారతదేశంలో కేవలం నాలుగు చోట్ల మాత్రమే ఉన్న అత్యంత పవిత్రమైన ఏకశిలా విగ్రహాలలో ఇది ఒకటి. ఒకే భారీ శిలపై శ్రీరామచంద్రుడితో పాటు, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, ఆంజనేయ స్వామి ఇలా మొత్తం 30కి పైగా దేవతామూర్తులు కొలువై ఉండటం ఇక్కడి విశేషం. ఈ స్వామివారిని దర్శించుకుంటే కలియుగంలోని సకల దుఃఖాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. శ్రీరామ నవమి పర్వదినాన ఉదయం 9 గంటలకు 'నిషా చూర్ణోత్సవం', 'ఎదురుకోళ్లు' మరియు 'గోపూజ'తో వేడుకలు ప్రారంభమవుతాయి. అనంతరం విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం నిర్వహిస్తారు. సరిగ్గా ఉదయం 11 గంటలకు పునర్వసు నక్షత్ర యుక్త అభిజిత్ లగ్న పుష్కరాంశ సుముహూర్తమున లోక కళ్యాణార్థం సీతారాముల తిరుక్కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా జరిపించ నున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు 'రామ్ లల్లా' జన్మ హారతి, హనుమాన్ చాలీసా పారాయణం, అనంతరం సాధు ప్రవచనాలు ఉంటాయి. మధ్యాహ్నం 1 గంట నుండి భక్తులకు భారీ ఎత్తున తదియారాధన (అన్నదానం) ఏర్పాటు చేశారు. సాయంత్రం 3 గంటలకు స్వామివారి పల్లకి సేవ మరియు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నాయి.

## మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ - డాక్టర్ హేమ సామల



సికింద్రాబాద్, మార్చి 24(వార్త వేదిక సూర్య)

నేతాజీ రెయిన్బో కమ్యూనిటీ కేర్ లెర్నింగ్ సెంటర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళల సాధికారత, సమానత్వం మరియు సమాజ అభివృద్ధిలో మహిళల పాత్రపై ప్రత్యేకంగా ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, విద్య మరియు స్వావలంబన ద్వారా తమ స్థానం మరింత బలపరచుకోవాలని డాక్టర్ సామల హేమ గారు పేర్కొన్నారు. సమాజంలో మహిళల గౌరవం, భద్రత, అవకాశాల పెంపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య భాగంగా, నేతాజీ రెయిన్బో కమ్యూనిటీ కేర్ లెర్నింగ్ సెంటర్‌లో చదువుకుంటున్న విద్యార్థుల కుటుంబాలకు నెలకు సరిపడే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. బియ్యం, పప్పులు, నూనె వంటి అవసరమైన వస్తువులతో కూడిన ఈ సరుకులు అందించడం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సంస్థ చేయూతనందించింది. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల విద్యను కొనసాగించేందుకు కుటుంబాలకు సహాయపడటమే ప్రధాన లక్ష్యంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతాజీ రెయిన్బో కమ్యూనిటీ కేర్ లెర్నింగ్ సెంటర్ ఇంచార్జ్ కళావతి,రాజు తదితరులు పాల్గొన్నారు

సంపుటి 1 సంచిక 298 వార్త వేదిక సూర్య హైదరాబాద్ బుధవారం, మార్చి 25, 2026

# శంషాబాద్ గౌడ సంక్షేమ సంఘం సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

మైలర్ దేవ్ పల్లి, మర్చి 24 ( వార్త వేదిక సూర్య ) :

శంషాబాద్ మండల పరిధిలోని తొండపల్లిలో ఉన్న ఎం.ఎస్ గార్డెన్స్‌లో శంషాబాద్ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గౌడ సోదరుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కుల వృత్తిని నమ్ముకున్న వారికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గౌడ సమాజం సంఘటితంగా ఉండి అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మండలంలోని గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల గౌడ సంక్షేమ సంఘం నాయకులు, ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గౌడ కుల బాంధవులు పాల్గొన్నారు.








# వ్యాపారం తో పాటు సామాజిక సేవ చేయడం అభినందనీయం

## మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

నల్లగొండ బ్యూరో, మార్చి 24 (వార్తా వేదిక సూర్య )

ప్రజల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం అని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు. క్రీడాయ్ ఆధ్వర్యంలో నల్గొండ బస్టాండ్ లో క్రెడాయి సంస్థ వారు ఏర్పాటుచేసిన చలివేంద్రం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గత 3 సంవత్సరాల నుండి బస్టాండ్ లో వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చాలని ఉద్దేశంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమని కొనియాడారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జాన్ రెడ్డి మాట్లాడుతూ.. నల్గొండ బస్టాండ్ నుండి ప్రతినిత్యం 40,000 మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తారని. వారికి దాహార్తి తీర్చాలని. గత కొన్ని సంవత్సరాలుగా క్రెడాయ్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని. ఆర్టీసీ తరఫున వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అధ్యక్షులు బుర్రి శ్రీనివాస్ రెడ్డి, రాజలింగము అమంచి మాట్లాడుతూ.. ప్రతినిత్యం 1000 లీటర్ల ప్యూరిఫైడ్ మంచి నీళ్లతో నాలుగు నుంచి 5 వేల మంది బాటసారులకు ప్రయాణికులకు మంచినీళ్లు అందిస్తున్నామని తెలిపారు. మేము పిలవగానే చలివేంద్రాన్ని ప్రారంభించడానికి వచ్చిన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఎం . డి అశ్రఫ్ అలీ, ఆర్టీసీ ఆర్ ఎం జాన్ రెడ్డి , డి ఎం వెంకటరమణ, 47 వ వార్డ్ కార్పొరేటర్ అబ్బగోని కవిత రమేష్, ల కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పిల్లి కృష్ణ, బండారు ప్రసాద్, ఏచూరి భాస్కర్, కోశాధికారి దూదిపాల్ వెంకటరెడ్డి, మందడి వెంకటరెడ్డి, ఆవుల శ్రీనివాస్, పృథ్వి, మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అలుగుబెల్లి కిరణ్ రెడ్డి పల్నాటి నరసింహారెడ్డి సూరం సోమిరెడ్డి కృష్ణంరాజు యాదవ్, ఎం . రామారావు,వంగాల అనిల్ రెడ్డి, బొల్లెద్దు లింగయ్య, శౌరయ్య బొడ్డుపల్లి, రమేష్ నేతి విప్లవ కుమారు, లింగయ్య, ఆంజనేయులు సద్దాంహుస్సేన్, ప్రయాణికులు, మీడియా మిత్రులు, పట్టణ ప్రముఖులు, వ్యాపారవేతలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా గుంత



గట్టుప్పల.మార్చి 24.వార్త వేదిక సూర్య:

గట్టుప్పల మండల కేంద్రం లో రైస్ మిల్ ఎదురుగా తెరటపల్లి వెళ్లే దారిలో ములమలుపు వద్ద ఉన్న ప్రధాన రహదారి పై గుంత ఏర్పడింది.నిత్యం ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రదేశంలో ములమలుపు ఉండటంతో వాహనదారులు ప్రమాదనికి గురవుతున్నారు. అధికారులు రోడ్డు పై ఏర్పడిన గుంతను పూడ్చులని వాహనదారులు కోరుతున్నారు.

# ప్లాస్టిక్ నిషేధం పై లక్ష్మీపూర్ మహిళ సంఘాలు తీసుకున్న నిర్ణయం ఆదర్శనీయం

### అర్హులు అందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు...

### ఏటీసీ కేంద్రం ఏర్పాటుతో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు...

### జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి కి నిరంతరం కృషి చేస్తా....

### జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

జగిత్యాల మార్చి 24 వార్త వేదిక సూర్య



జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో 20 లక్షల నిధులతో రెండు మహిళా సంఘ భవన నిర్మాణాలకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి,సర్పంచ్ కవిత, ఉప సర్పంచ్ సత్తిరెడ్డి, డి ఈ లు మిలింద్, డి ఈ హౌసింగ్ సత్యనారాయణ,ఎమ్మార్వో వరందన్, ఆర్ ఐ. భూమయ్య, ఎం పి ఓ. రవి బాబు, ఏపిఎం రాజు,సత్తవ్వ,మహిళ సంఘం సభ్యులు, గ్రామ మండల నాయకులు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ టీబీ సూపర్వైజర్‌గా రాజేంద్రనగర్ టీబీ యూనిట్ 'నరేష్ కుమార్' ఎంపిక

## డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ లలితా దేవి చేతుల మీదుగా అవార్డు ప్రదానం

మైలర్ దేవ్ పల్లి, మర్చి 24 ( వార్త వేదిక సూర్య ) :

రంగారెడ్డి జిల్లా పరిధిలో క్షయ వ్యాధి (టీబీ) నివారణ మరియు నియంత్రణలో విశేష ప్రతిభ కనబరిచిన రాజేంద్రనగర్ టీబీ యూనిట్ సూపర్వైజర్ నరేష్ కుమార్ 'బెస్ట్ టీబీ సూపర్వైజర్' అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితా దేవి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ పాపారావు, డాక్టర్ అయేషా గార్ల చేతుల మీదుగా నరేష్ కుమార్ ఈ ఉత్తమ అవార్డును స్వీకరించారు.

ఈ సందర్భంగా డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ లలితా దేవి మాట్లాడుతూ.. జిల్లాను టీబీ రహితంగా మార్చే లక్ష్యంతో నరేష్ కుమార్ క్షేత్రస్థాయిలో చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. వ్యాధిగ్రస్తులను గుర్తించడం, వారికి సకాలంలో మందులు అందేలా చూడటం మరియు బాధితుల్లో మనోధైర్యాన్ని నింపడంలో ఆయన చూపిన చొరవ ఇతర సిబ్బందికి ఆదర్శమని



పేర్కొన్నారు. మెరుగైన సేవలందించే సిబ్బందికి ఎల్లప్పుడూ ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు.

తన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన జిల్లా అధికారులకు నరేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ గుర్తింపు తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో టీబీ రహిత జిల్లా కోసం మరింత ఉత్సాహంతో పని చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు టీబీ యూనిట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడాలి



## జోనల్ కమిషనర్‌కు బిఆర్ఎస్ మణికొండ నాయకుల వినతి

మైలర్ దేవ్ పల్లి, మర్చి 24 ( వార్త వేదిక సూర్య ) :

భారత రాష్ట్ర సమితి మణికొండ నాయకులు సంబంధిత సమస్యలపై నిరంతర పోరాటం కొనసాగిస్తూ, స్థానిక అధికారులకు పలు సమస్యల గురించి పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, తగిన స్పందన అందనట్లుందని తెలిపారు. ముఖ్యంగా అంబేద్కర్ భవన్, బుల్కాపూర్ నాలా, వీధి వ్యాపారస్తుల విక్రయ కేంద్రాల ఏర్పాటు, పందెంవాగు బాక్స్ డ్రైన్ నిర్మాణం, టీం.4 బిల్డర్స్ పై చర్యలు, ఇళ్ల మధ్య రెడీమిక్స్ సిమెంట్ ప్లాంట్లకు అనుమతి నిరాకరణ, ట్రాఫిక్ సమస్యలున్న రహదారులలో వైన్ షాప్లకు అనుమతి నిరాకరణ, మరియు సమీకృత సమగ్ర మార్కెట్ ఏర్పాటు వంటి అంశాలు ప్రధానంగా ఉన్నాయని నేతలు తెలిపారు.

పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ప్రకారం, ఈ సమస్యలపై స్థానిక అధికారులు తగిన చర్యలు చేపట్టకపోతే, ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమాలను చేపట్టగలమని హెచ్చరించారు.

ఈ క్రమంలో మంగళవారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంకు వెళ్లి మెమోరాండం సమర్పించారు.అదనంగా, మునిసిపల్ అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ అమృతను కలసి పార్కుల అభివృద్ధి విషయాలు చర్చించగా, నెమిలి నగరు పార్క్ మరియు పుప్పాలగూడ బాలాజీ నగర్‌లోని పి వి నరసింహారావు పార్క్ అభివృద్ధి పై ప్రత్యేకంగా మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాద్ రెడ్డి, యలాల కిరణ్, భాను చందర్, సుమనళిని, నూకల మంజు, దేవి ప్రియ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీరామ్ జన్మదిన సంస్కారం

## 5000 రూపాయలు గాయత్రీ పరివార్ కు విరాళంగా ఇచ్చిన శ్రీరామ్

దేవరకొండ మార్చి 24 (వార్త వేదిక సూర్య):-

కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన గాయత్రి టైలర్స్ నిర్వాహకులు గాజుల కుశాల్ అజిత దంపతుల కుమారుడు శ్రీరామ్ జన్మదిన సంస్కారాన్ని గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో ప్రజ్ఞాపీఠ్ వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రి నిర్వాహకులు వింజమూరు చంద్రమౌళి గాయత్రి మంత్రం, మృత్యుంజయ మంత్రంతో శ్రీరామ్ ని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సంప్రదాయ ప్రకారం జ్యోతి వెలిగించి జన్మదిన సంస్కారాన్ని నిర్వహించుకోవాలన్నారు. జ్యోతి వలె వెలుగుతూ దినదిన అభివృద్ధి చెందాలన్నారు. సన్మార్గంలో ప్రయాణిస్తూ ఆదర్శంగా జీవించాలన్నారు. ప్రతి జన్మదినం సందర్భంగా శ్రీరామ్ తను దాచుకున్న డబ్బులను అంశధానంగా గాయత్రి పరివారకు అందించడం అభినందనీయమన్నారు. శ్రీరామ్ తను దాచుకున్న 5000 రూపాయలను గాయత్రీ పరివార్కు అందించారు. శ్రీరామ్ ను ఆదర్శంగా తీసుకొని పిల్లలు డబ్బులను పొదుపు చేయాలని, దాన గుణాన్ని కూడా కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వింజమూరు విజయలక్ష్మి చంద్రమౌళి, ఏరుకొండ రాము, మారం వెంకటేశ్వర్లు, వాసు, మంజుల, వాణి తదితరులు పాల్గొన్నారు

# ఆర్టీసీ రక్షణ కోసం కార్మికులు ఐక్య పోరాటానికి సిద్ధం

మైలర్ దేవ్ పల్లి, మర్చి 24 ( వార్త వేదిక సూర్య ) :


స్థానిక రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో గేట్ ముందు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జాజాల రుద్రకుమార్ తెలిపారు, ఆర్టీసీ ఉద్యోగులు తమ హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని.కార్మికుల డిమాండ్ ప్రకారం, ప్రభుత్వ విద్యుత్ బస్సుల విధానంలో మార్పు చేసి, వాటిని ఆర్టీసీలకు కేటాయించాలి. విద్యుత్ బస్సుల కొనుగోలు, నిర్వహణ మరియు ఆపరేషన్ మొత్తం ఆర్టీసీలు చేపట్టే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాన్ని మార్చాలని కోరారు.

ఎస్ డబ్ల్యూ ఎఫ్ కృష్ణ తెలిపారు, కాలుష్య నియంత్రణ కోసం కేవలం విద్యుత్ బస్సులనే ఆధారంగా చూపడం సరైనది కాకపోవడంతో, ప్రైవేట్ పెట్టుబడిదారులకు మాత్రమే లాభం కల్పిస్తూ ఆర్టీసీలను నిర్వీర్యం చేస్తున్నారని. దేశంలో మొత్తం వాహనాల సంఖ్య 42 కోట్లకు పైగా ఉండగా, బస్సులు కేవలం 1,40,000 మాత్రమే ఉన్నందున, ప్రజారవాణా వ్యవస్థను



అభివృద్ధి చేయడం అత్యవసరమని పేర్కొన్నారు.

కార్మికులు 2017 వేతనాలే ఇప్పటివరకు పొందుతూ వచ్చారని, 2021, 2025 వేతన సవరణలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, కొత్త ఉద్యోగాల కల్పన, హామీల అమలు లేనిపక్షంలో పెద్ద ఎత్తున సమైక్య ఆందోళనలకు ముందుకొస్తామని హెచ్చరించారు.ధర్నా కార్యక్రమంలో సిఐటియు రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు పిసికే భాస్కర్, జిల్లా నాయకులు రాజు, మల్లేష్, టీ వెంకటేష్ గౌడ్, డిపో ఉద్యోగులు చంద్రయ్య, గఫార్, అంజయ్య, రవి, వెంకటేష్, అర్జున్, రాజయ్య, అక్బర్, యాదయ్య, రాము, కిరణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## చౌటుప్పల్, నారాయణపురం

# విద్యుత్ బస్ లను ఆర్టీసిలకే ఇచ్చి ఆర్టీసిని బలోపేతం చేయాలి

### కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : డిపోల ముందు ధర్నా

నల్లగొండ బ్యూరో, మార్చి 24 (వార్తా వేదిక సూర్య )

విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీ కే ఇచ్చి ఆర్టీసీని బలోపేతం చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం డి సలీం పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు దొడ్డి కొమురయ్య భవన్ నుండి ప్రదర్శనగా వెళ్లి నల్లగొండ ఆర్టిసి డిపో ముందు ధర్నా నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎం.వి.యాక్ట్-2019 మరియు విద్యుత్ బస్ల విధానం వల్ల ఆర్టీసిలు తీవ్రమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. విద్యుత్ బస్ల వల్ల ఆర్టీసిలు కనుమరుగై, ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలు మాత్రమే ఆర్టీసిలో మిగిలే పరిస్థితి వుంటుంది. ఈ నేపథ్యంలో విద్యుత్ బస్ ల విధానంలో మార్పులు చేసి, విద్యుత్ బస్ ల కొనుగోలు, నిర్వహణ, ఆపరేషన్స్ అన్ని ఆర్టీసినే చేసేలా చర్యలు తీసుకోవాలని, ఆర్టీసిల ఆదాయానికి ఖర్చుకు మధ్య వున్న వ్యత్యాసాన్ని ప్రభుత్వాలు రీ-ఎంబర్స్ చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. విద్యుత్ బస్లు - ఆర్టీసి పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారం, కేంద్ర ప్రభుత్వ విద్యుత్ బస్ల విధానంలో మార్పుచేయాలని, జిసిసి



పద్ధతినిరద్దు చేసి, ప్రైవేటు సంస్థలకు ఇస్తున్న అన్ని సబ్సిడీలను ఆర్టీసిలకు ఇవ్వాలి. ఆర్టీసి లే నేరుగా విద్యుత్ బస్లు సమకూర్చుకొనేందుకు అవకాశం ఇవ్వాలి. బడ్జెట్లో నిధులు కేటాయించాలి. ఆర్టీసి బస్ల ఆపరేషన్ ఖర్చుకు, ఆదాయానికి మధ్య వ్యత్యాసాన్ని (వయబిలిటీ గ్యాప్ ఫండ్)ను ఆర్టీసికి ఇవ్వాలి. ం విద్యుత్ బస్ల బాడీ ఫ్యాబ్రికేషన్ ఆర్టీసి వర్క్షాప్లలో చేయించాలి. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలి.,ప్రజల అవసరాల మేరకు బస్ల సంఖ్యను పెంచాలి. పిఎమ్ ఇ డ్రైవ్ పథకంలో ఇస్తున్న సబ్సిడీని ఆర్టీసి చేసే 'రెట్రో ఫిట్మెంటు' బస్ లకు కూడా వర్తింప చేయాలి. ఆర్టీసి కార్మికుల ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్స్ పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు ఈనెల 25న ఉద్యోగ ఉపాధ్యాయ విద్యార్థి యువజన కార్మిక మహిళ వివిధ రాజకీయ పార్టీలతో ఆర్టీసీ పరిరక్షణ కోసం ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం లైబ్రరీ హాల్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరుగుతుందని అనంతరం ఆర్టీసీ పరిరక్షణ వేదిక ఏర్పాటు చేసి పోరాటాలు ఉ ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య, జిల్లా సహాయ కార్యదర్శి అవుట రవీందర్ ఎస్ డబ్ల్యూ ఎఫ్ రీజయన్ అధ్యక్షులు కందుల నరసింహ సహాయ కార్యదర్శి కె శ్యాంసుందర్ డిపో కార్యదర్శి ఎస్కే గులాం రసూల్ అధ్యక్షులు ఏం నరసింహయ్య సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చింతకాయల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.





# హతసాక్షి పాస్టర్ ప్రవీణ్ పగడాల ప్రథమ వర్ధంతి

### తెలంగాణ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్

నల్లగొండ బ్యూరో, మార్చి 24 (వార్తా వేదిక సూర్య )



సూర్యాపేట రూరల్ మండల కేంద్రం తాళ్లకంపహాడ్ గ్రామం లో గ్రేస్ సీయోను చర్చి లో స్థానిక పాస్టర్, మండల అధ్యక్షులు పాస్టర్ యల్క ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రెవ. ఏర్పుల క్రీస్టోఫర్ ఆధ్వర్యంలో హతసాక్షి పాస్టర్ ప్రవీణ్ పగడాల ప్రథమ వర్ధంతి సందర్భంగా కొవ్వత్తులతో నివాళులు అర్పించి కుటుంబ ఆధరణకొరకు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిధులుగా తెలంగాణ క్రిస్టియన్ రాష్ట్ర వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్, సువార్త ఫుల్ గాస్పల్ చర్చ్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రల కో - ఆర్డినేటర్ పాస్టర్ సి. హెచ్. శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ.. హతసాక్షి పాస్టర్ ప్రవీణ్ పగడాల గొప్ప క్రైస్తవ వక్త, నిగర్వి, స్నేహాశీలి, మృదు స్వభావి, నిరుద్యోగ యువతకు ఆదర్శ ప్రాయుడు అతని సేవలు మరువలేనివనీ, వారు భౌతికంగా మా మధ్యలో లేకపోయినా యావత్ భారతదేశం క్రైస్తవ లోకానికి వారి మరణం తీరనిలోటని, వారు చిందించిన రక్తం శత్రువులను సహితం కలిసివేశిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో ఉమ్మడి నల్గొండ జిల్లా కన్వీనర్ చింత మనిషే, జిల్లా నాయకులు ఉటుకూరి రాజు,సూర్యాపేట గౌరవ సలహాదారులు రెవ. బొక్క ఏలీయా రాజు,సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షులు రెవ. డా. జలగం జేమ్స్, తుంగతుర్తి నియోజకవర్గం సీనియర్ నాయకులు సి. హెచ్. కిరణ్ కుమార్, రెవ. పంది మార్క్,యం.రూబెన్, పి. వి. బోయాజ్, కె. లాజర్,యం. క్రిస్టోఫర్,పిట్టల సామెల్,శ్యాగ యాకోబు,మిద్దె హెబ్రోన్ రాజు,బి. సైమన్, డి. రాజు,భాస్కర్,ఆర్.ప్రేమ్ సాగర్, బాలరాజు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# తిప్పర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



### ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించే విధంగా పని చేయాలి -- జిల్లా ఎస్పీ

నల్గొండ టౌన్ మార్చి 24 /వార్త వేదిక సూర్య/

నల్లగొండ సబ్ డివిజన్ పరిధిలోని తిప్పర్తి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ రెండు రోజులు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పని తీరు, స్టేషన్ పరిధిలోని పరిస్థితులు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ మేనేజ్‌మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్ విభాగం, లాక్ అప్, ఎస్.హెచ్.ఓ గది తదితర విభాగాలను జిల్లా ఎస్పీ గారు పరిశీలించి,స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న మరియు నమోదైన కేసుల వివరాలు, స్టేషన్ రికార్డులను సమగ్రంగా తనిఖీ చేసి, కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు ఎటువంటి అలసత్వం వహించరాదని సూచించారు. దర్యాప్తులో ఉన్న కేసులను సమగ్రంగా విచారణ చేసి, చట్ట ప్రకారం నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని ఆదేశించారు.

గ్రామ పోలీసు అధికారులు ప్రతిరోజూ తమ పరిధిలోని గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో మమేకమై నేర నియంత్రణకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. ప్రజా ఫిర్యాదులపై ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణ స్పందన చూపాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, బ్లూ కోల్ట్ మరియు పెట్రో కార్ విధుల్లో ఉన్న సిబ్బంది డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందిస్తూ సంఘటనా స్థలానికి త్వరితగతిన చేరుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పెట్రోలింగ్ సమయంలో స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతిరోజూ తనిఖీ చేయాలని, స్టేషన్ పరిధిలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు పై ప్రత్యేక దృష్టి సారించి, మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్ మరియు డయల్ 100 సేవల వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

అలాగే, అసాంఘిక కార్యకలాపాలు అయిన గంజాయి, అక్రమ ఇసుక రవాణా, పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా, జూదం వంటి నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి, శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి, తిప్పర్తి ఎస్.ఐ శంకర్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




# అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్య విరుద్ధం : ఇరగదిండ్ల కృష్ణ

దేవరకొండ మార్చి 24 ( వార్తా వేదిక సూర్య ):-

నల్లగొండ జిల్లా,దేవరకొండ నియోజకవర్గ తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం నాడు తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరుతున్న తరుణంలో, పోలీసులు ముందస్తు అరెస్టులకు పాల్పడటం అన్యాయమని దేవరకొండ నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షులు ఇరగదిండ్ల కృష్ణ తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో ఇరగదిండ్ల కృష్ణ తన నివాసం నుండి అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతుండగా, పోలీసులు అక్కడికి చేరుకుని ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సుమారు గంట సేపు స్టేషన్‌లోనే ఉంచి, ఆయన వివరాలు నమోదు చేసుకుని, ఫోటోలు తీసుకున్న అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇరగదిండ్ల కృష్ణ మాట్లాడుతు "శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోంది."

"ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనీయకుండా పోలీసుల ద్వారా అణచివేయడం సరైనది కాదని."

"ముందస్తు అరెస్టులతో మా పోరాటాన్ని ఆపలేరు. మా హక్కుల సాధన కోసం నిరంతరం శ్రమిస్తాం." ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొని పోలీసుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు

# BRSV నేతల ముందస్తు అరెస్ట్


గట్టుప్పల .మార్చి, వార్త వేదిక సూర్య:




దీ=ూం నేతల ముందస్తు అరెస్ట్ అప్రజాస్వామికం అని దీ=ూం మునుగోడు నియోజకవర్గ నాయకులు ఖమ్మం రాజశేఖర్ అన్నారు. విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న ఫీజు రియాంబర్స్మెంట్, స్కాలర్ షిపలను వెంటనే విడుదల చేయాలనీ చలో అసెంబ్లీ కి దీ=ూం పిలుపునివ్వడం తో ముందస్తు అరెస్ట్ చేయడం సబబు కాదు అన్నారు. ఒకవైపు ప్రజా పాలనా అని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి ముందస్తు అరెస్ట్ ల పేరుతో బైండొవర్ చేయడం ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం అన్నారు. వెంటనే పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, పీజు రియాంబర్స్ మెంట్ లను విడుదల చేయాలనీ ప్రభుత్వం ని డిమాండ్ చేసారు. లేని పక్షంలో దీ=ూం ఆధ్వర్యంలో ఆందోళన ను ఉధృతం చేస్తామని హెచ్చరించారు అరెస్ట్ అయినా వారిలో చిలువేరు అయోధ్య ఉన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలు ప్రజలు స్పదినియోగం చేసుకోవాలి

చౌటుప్పల్ మార్చి 24 వార్తా వేదిక సూర్య



ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు రజినియోగం చేసుకోవాలని చౌటుప్పల్ మున్సిపాలిటీ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. మంగళవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ ప్రారంభించారు.



ఈ సందర్భంగా పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో నియోజకవర్గ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ముఖ్యంగా చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఆరోగ్య శిబిరాలను విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య సూత్రాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుత కాలంలో టాబ్లెట్ వాడాల్సిన అవసరం లేకుండా జీవించేవారే నిజమైన కోటీశ్వరులని, ఎన్ని డబ్బులు ఉన్నా మందులపై ఆధారపడి జీవించేవారు పేదవారితో సమానమని" పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ శిబిరంలో పారిశుధ్య కార్మికులు సైతం పాల్గొని పరీక్షలు చేయించుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాటమరాజు మరియు వారి వైద్య బృందం ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వో యశోద, డా॥ కాటంరాజు మండల వైద్యాధికారి, కౌన్సిలర్ కొయ్యడ శేఖర్, ఆలె శ్రీలత చిరంజీవి, బుడ్డ సురేష్,మొగుదాల రమేష్ గౌడ్, డా. రమేష్, డా.గాంధీ, డా.జయంత్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, స్థానిక నాయకులు , మున్సిపల్ సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు.

సంపుటి 1 సంచిక 298 వార్త వేదిక సూర్య హైదరాబాద్ బుధవారం, మార్చి 25, 2026




# అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలేరు

**-ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి**

**-ప్రజా సమస్యలు పరిష్కరించడకుండా అణిచివేయడం దారుణం**

**-ప్రజలకు ఇచ్చిన 6గ్యారంటీలు 420 హామీ అమలు చేయాలి**

**-బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు,బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ**

దేవరకొండ మార్చి 24 (వార్త వేదిక సూర్య):-

అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలేరు అని బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు,బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ లు అన్నారు.మంగళవారం అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బిఆర్ ఎస్వీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి అని ఆయన వారు డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలు పరిష్కరించడకుండా అణిచివేయడం దారుణం అని ఆయన అన్నారు.ప్రజలకు ఇచ్చిన 6గ్యారంటీలు 420 హామీ అమలు చేయాలి అని డిమాండ్ చేశారు.అరెస్టు అయిన వారిలో కౌన్సిలర్ పొట్ట మధు,నేనావత్ నాగార్జున,తదితరులు పాల్గొన్నారు

# చిన్నారి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న దేవరకొండ మున్సిపల్ కౌన్సిలర్ ముత్యాల రవికుమార్

దేవరకొండ మార్చి 24 ( వార్త వేదిక సూర్య):-



దేవరకొండ పట్టణంలో అంజయ్య కాలనీ చెందిన ఆర్ అండ్ బి సీనియర్ అసిస్టెంట్ ఐతబోయిన కృష్ణ కుమార్తె మొదటి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న. దేవరకొండ మున్సిపల్ కౌన్సిలర్ ముత్యాల రవికుమార్ యాదవ్ పులిపాటి సన్నీ అన పీజీ శ్యామ్ సన్ సార్ కరాటే మాస్టర్ సిహెచ్ శ్రీను గుండాల వెంకట్ యాదవ్, సీమర్ల వెంకటయ్య యాదవ్ ఆర్ అండ్ బి సీనియర్ అసిస్టెంట్ కుమార్ గెలమోని మహేష్, ఎస్.కె నిరంజన్, సైదులు, కోమల్ల బాలకృష్ణ, గిరి, తోటపల్లి మల్లేష్, బీనమోనీ శివ యాదవ్, గణపతి, తోటపల్లి శివ, అంజి యాదవ్, రాఘవరెడ్డి, గుండాల బ్రూస్ లీ యాదవ్, పులిపాటి అభి, గుండాల శివాని తదితరులు పాల్గొన్నారు

# ఇంపాక్ట్ మోటివేషనల్ స్పీకర్ గా నక్క మహేష్

**మోటివేషనల్ స్పీకర్గా సర్టిఫికెట్ అందుకున్న**

**రావిరాల గ్రామానికి చెందిన నక్క మహేష్**

మహేశ్వరం, మార్చ్ 24, వార్త వేదిక సూర్య






రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ జిహెచ్ఎంసి రావిరాల గ్రామ పట్టణానికి చెందిన నక్క మహేష్ మోటివేషనల్ స్పీకర్గా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. శని ఆదివారాల్లో నల్గొండ లోని ఒక ప్రైవేటు హోటల్లో జరిగిన కార్యక్రమంలో నేషనల్ హెడ్ బోర్డ్ మెంబర్ నూనె సుదర్శన్ చేతుల మీదుగా మోటివేషనల్ స్పీకర్గా సర్టిఫికెట్ ను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రీజియన్ 2 ప్రెసిడెంట్ కోట్ల సాయికిరణ్, కోటా సరిత నారాయణ కవిత, గూడూరు అంజిరెడ్డి, వీరవెల్లి శ్రీలత, హర్షిత, రవీంద్ర చారి, బాలు, సరిత మొదలగు ట్రైనర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నక్క మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు యువతకి ప్రేరణ కలిగించి వారి లక్ష్యాలు సాధించే విధంగా జ్ఞాన నైపుణ్యాలు అందించడం, సమాజ సేవతో దేశాభివృద్ధిలో పాల్గొనడం తన కర్తవ్యం అని తెలిపారు.ఈ సందర్భంగా శిక్షణ పొందిన 30 ట్రైనర్లు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు గురూజీ గంపా నాగేశ్వరరావు కి నక్క మహేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# చారిత్రక పెద్ద మునిగల్ ( ఎస్టి ) రిజర్వ్ నియోజకవర్గాన్ని పునరుద్ధరించాలి

**రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ ( ఆర్ టి ఐ ఎస్ ఎస్ ) ఫౌండర్ & నేషనల్ ప్రెసిడెంట్ కేతావత్ బాబురామ్ నాయక్ డిమాండ్**

దేవరకొండ మార్చి 24 ( వార్త వేదిక సూర్య):-

నల్గొండ జిల్లా పశ్చిమ ప్రాంత గిరిజన తండాల రాజకీయ భవిష్యత్తు మరియు సమగ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ, రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ (ఆర్ టి ఐ ఎస్ ఎస్ ) ఫౌండర్ & నేషనల్ ప్రెసిడెంట్ కేతావత్ బాబురామ్ నాయక్ మాట్లాడుతూ గతంలో నియోజకవర్గ కేంద్రంగా ఉండి ప్రస్తుతం ఉనికి కోల్పోయిన 'పెద్ద మునిగల్'ను తిరిగి నియోజకవర్గంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. 1950 మరియు 60వ దశకంలో పెద్ద మునిగల్ ఒక స్వతంత్ర రాజకీయ కేంద్రంగా, శక్తివంతమైన నియోజకవర్గంగా సేవలందించిన చరిత్ర ఉందని, నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఈ ప్రాంత గిరిజనులు తమ వేలాది ఎకరాల సారవంతమైన భూములను, తమ పూర్వీకుల ఆవాసాలను మరియు సర్వస్వాన్ని త్యాగం చేశారని ఆయన గుర్తు చేశారు. ఆనాడు ప్రాజెక్టు ముంపు వల్ల ప్రజలు వికేంద్రీకరణకు గురయ్యారనే సాకుతో, 1970ల తర్వాత జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో పెద్ద మునిగల్ నియోజకవర్గ హోదాను రద్దు చేయడం గిరిజన జాతికి జరిగిన తీరని చారిత్రక అన్యాయమని, రాష్ట్రం సుభిక్షం కావడం కోసం మేము చేసిన త్యాగానికి ప్రతిఫలంగా మా రాజకీయ గుర్తింపునే కోల్పోవాల్సి రావడం అత్యంత బాధాకరమని బాబురామ్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు.



ప్రస్తుతం దేవరకొండ మరియు నాగార్జున సాగర్ నియోజకవర్గాల్లో ముక్కలు ముక్కలుగా విడిపోయి, సరైన రాజకీయ ప్రాతినిధ్యం లేక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న చందంపేట, నేరడుగొమ్ము, డిండి (గుండ్లపల్లి) మరియు పెద్ద మునిగల్ మండలాలను ఏకం చేసి, 'పెద్ద మునిగల్' కేంద్రంగా నూతన ఎస్టీ రిజర్వ్ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయడమే ఇప్పుడున్న ఏకైక పరిష్కారమని ఆయన ప్రతిపాదించారు. ఈ నాలుగు మండలాల్లో 65 శాతానికి పైగా గిరిజన (గు) జనాభా ఉంది కాబట్టి, రాజ్యాంగబద్ధంగా మరియు సామాజిక న్యాయం ప్రకారం దీనిని తప్పనిసరిగా రిజర్వ్ సీటుగా ప్రకటించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, భౌగోళికంగా దేవరకొండ నియోజకవర్గం చాలా విస్తృతమైనది కావడంతో మారుమూల తండాల ప్రజలు ఒక చిన్న పని కోసం 80 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని, దీనివల్ల పాలన ప్రజలకు చేరువ కావడం లేదని ఆయన విశ్లేషించారు. మా భూములిచ్చాం, మా ఊర్లనిచ్చాం.. కానీ మా రాజకీయ ఉనికిని వదులుకోమని, 1970ల నాటి మా నియోజకవర్గ వైభవాన్ని మరియు మా చారిత్రక హక్కులను తిరిగి సాధించుకునే వరకు రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ తరపున మా పోరాటం ఆగదని, రాబోయే డీలిమిటేషన్ కమిషన్ మరియు రాష్ట్ర ప్రభుత్వం ఈ విన్నపాన్ని సానుకూలంగా పరిశీలించి పెద్ద మునిగల్‌ను కొత్త ఎస్టీ నియోజకవర్గంగా ప్రకటించాలని కేతావత్ బాబురామ్ నాయక్ విజ్ఞప్తి చేశారు

# జిల్లాలో ఇసుక సరఫరా పూర్తి గా ఆన్లైన్ ద్వారా నే చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

యాదాద్రి/వార్త వేధిక సూర్య:-

జిల్లాలో ఇసుక సరఫరా పూర్తి గా ఆన్లైన్ ద్వారా నే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవాం రోజు కలెక్టరేట్, వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్, ఎస్పీ యాదవ్ జిల్లాలో ఇసుక సరఫరా, వినియోగం, నిల్వలు, రవాణా తదితర అంశాలపై ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి మైన్స్ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం మరియు ప్రభుత్వ అవసరాల కోసం అవసరమైన ఇసుక ను పూర్తి గా ఆన్లైన్ విధానం లోనే చేసుకొని పొందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. . ఇసుక రీచ్‌ల వద్ద నియమ నిబంధనలు కచ్చితంగా పాటించడంతో పాటు అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు.ప్రజలకు పారదర్శకంగా ఇసుక అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే, ఆన్లైన్ బుకింగ్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.ఇసుక నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి,అసిస్టెంట్ డైరెక్టర్ మైనింగ్ రవికుమార్, ఇరిగేషన్ యస్ ఈ రవీందర్ ,జిల్లా రవాణా అధికారి హరికృష్ణా,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో అధికారులు ,సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

యాదాద్రి/వార్త వేధిక సూర్య:-

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో అధికారులు ,సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.మంగళవారం అదనపు కలెక్టర్ మోత్కూర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్నం భోజనం పథకం కింద విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్.. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. అలాగే పప్పులు, బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను పరిశీలించారు. అన్నం సరిగ్గా అవ్వకపోతే వెంటనే సంబంధిత స్పెషల్ అధికారికి తెలియజేసి బియ్యం మార్చుకోవాలని సూచించారు. నాణ్యత ప్రమాణాల్లో ఎటువంటి రాజీ ఉండకూడదని సంబంధిత సిబ్బందికి కఠినంగా సూచించారు.విద్యార్థులకు సరిపడా భోజనం, పాలు సరైన పరిమాణంలో ఇస్తున్నారా అని అడిగి తెలుసుకొని సమయానికి విద్యార్థులకు ఇవ్వాలన్నారు. వంటగదిలో తయారైన అన్నం, కూరల నాణ్యతను కూడా క్షుణ్ణంగా పరిశీలించి, శుభ్రతతో పాటు రుచికరమైన ఆహారం విద్యార్థులకు అందించాలన్నారు. పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులను పరీక్షలు బాగా రాస్తున్నారా అడిగి తెలుసుకుని ప్రణాళిక బద్ధంగా పరీక్షకు సిద్ధం కావాలని విద్యార్థులకు అదనపు కలెక్టర్ సూచించారు. పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ తనిఖీలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం



**అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరు**

**- ఏప్రిల్ మొదటివారంలో తిరిగి సమావేశం కానున్న కమిటీ**

హైదరాబాద్, మార్చి 24: వార్త వేదిక సూర్య

హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ బోర్డు రూమ్‌లో ఈ రోజు రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్ఎంఏసీ -- స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ) సమావేశం జరిగింది. ప్రెస్ అకాడమీ, ఎస్ఎంఏసీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార--పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్, ఎస్ఎంఏసీ కో-చైర్‌పర్సన్ సీహెచ్ ప్రియాంకతో కలిసి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అక్రిడిటేషన్ కోసం జర్నలిస్టులు సమర్పించిన దరఖాస్తులను కమిటీ సభ్యులు సమగ్రంగా పరిశీలించారు.

జర్నలిస్టుల నుంచి అందిన ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు కార్డు మంజూరులో ఎలాంటి లోపం ఉండదని స్పష్టం చేశారు.

అక్రిడిటేషన్ కమిటీ సమావేశాన్ని వచ్చే నెల మొదటివారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లాల వారీగా కలెక్టర్లు పంపే 'జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)' ప్రతిపాదనలను కూడా పరిశీలించి ఆమోదం తెలుపుతుందని వెల్లడించారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లను కోరారు. సమాచార--పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్ పాటు ఇతర కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.



# కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా సేవలందిస్తున్న పోచంపల్లి బ్యాంక్

**పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 52వ సర్వసభ్య సమావేశం**

**పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్**

**బ్యాంక్ సీఈఓ సీత శ్రీనివాస్**

భూదాన్ పోచంపల్లి, మార్చ్ 24 వార్త వేదిక సూర్య

కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా పోచంపల్లి బ్యాంక్ సేవలు అందిస్తుందని పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, బ్యాంక్ సీఈఓ సీత శ్రీనివాస్ అన్నారు.పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 52వ వార్షిక సర్వసభ్య సమావేశం మంగళవారం నాడు బ్యాంక్ ప్రధాన కార్యాలయంలోని కొంగరి భాస్కర్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశంలో బ్యాంక్ ప్రగతి, భవిష్యత్తు ప్రణాళికలపై కీలక చర్చలు జరిగాయి.

ఈ సందర్భంగా చైర్మన్ తడక రమేష్ మాట్లాడుతూ బ్యాంక్ దినదినాభివృద్ధి చెందుతోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా బ్యాంక్‌కు 22 శాఖలు ఉన్నాయని, రానున్న రోజుల్లో మరింత విస్తరించి ఖాతాదారులకు మరింత చేరువవుతామని తెలిపారు. బ్యాంక్ అభివృద్ధికి పాలకవర్గం అహర్నిశలు కృషి చేస్తుందని పేర్కొన్నారు.అనంతరం బ్యాంక్ సీఈఓ సీత శ్రీనివాస్ వార్షిక నివేదికను సమర్పిస్తూ బ్యాంక్ ఆర్థిక స్థితిగతులను వివరించారు.తేదీ 23.03.2026 నాటికి బ్యాంక్ గణాంకాలు, డిపాజిట్లు: రూ. 313.62 కోట్లు, రుణాలు రూ. 242.03 కోట్లు

మొత్తం వ్యాపారం: రూ. 556 కోట్లు

ప్రభుత్వ మరియు కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా తమ బ్యాంక్ ఆధునిక సాంకేతిక సేవలను అందిస్తోందని, ఖాతాదారులందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ భరత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రహ్మణ్యం, ఎలె హరిశంకర్, సూరేపల్లి రమేష్, రాపోలు వేణు, గుండుకావ్య, కర్నాటి భార్గవి, బిట్టు భాస్కర్, ముక్తాల నరసింహ, కోల్లి రామగోపాలరావు, మిర్యాల యాదగిరి, రాపోలు భావనా ఋషి, కోడమడుగు ఎల్లస్వామి, కొండ శంకరయ్య, కుడికాల బాలనరసింహ, బొగ్గ సిద్ధిరాములుతో పాటు గత పాలకవర్గ సభ్యులు, వ్యవస్థాపకులు, వాటాదారులు, వివిధ శాఖల మేనేజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# బస్వాపూర్ రిజర్వాయర్‌కు సంబంధించి పునరావాసం పనుల పరిశీలన

యాదాద్రి/వార్త వేధిక సూర్య:-

భువనగిరి మండల పరిధిలోని బస్వాపూర్ రిజర్వాయర్‌కు సంబంధించి పునరావాసం మరియు పునర్వ్యవస్థీకరణ (ఆర్ అండ్ ఆర్) ప్రాజెక్టు కింద అభివృద్ధి చేస్తున్న బి.ఎన్. తిమ్మాపురం, లప్పానాయక్ తండా లే అవుట్‌లను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి తో కలసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ లే అవుట్‌లో కొనసాగుతున్న మరియు పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల పనులను పరిశీలించారు . ఇప్పటి వరకు చేపట్టిన పనుల పురోగతిని అడిగి తెలుసుకుని, ఇంకా ప్రారంభించాల్సిన పనులను తక్షణమే మొదలు పెట్టాలని సంబంధిత అధికారులను కోరారు . నివసించే ప్రజలకు అవసరమైన రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలను త్వరితగతిన అందించాలన్నారు.ప్రభుత్వ భవనాల నిర్మాణంపై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు, వాటి నిర్మాణం ఎప్పుడు ప్రారంభమవుతుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కాలనీలోకి వెళ్లే మట్టి రహదారులను చదును చేసి, రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చుడాలన్నారు ఈ కార్యక్రమంలో భువనగిరి మండలం తహసీల్దార్ జగన్మోహన్ ప్రసాద్‌తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆరేగూడెం లో బీర్ల ఐలన్న సహకారం తో సీసీ రోడ్లు నిర్మాణం



మోటకొండూరు/ మార్చి 24 వార్త వేదిక సూర్య :యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలం ఆరెగూడెం గ్రామంలో ఎన్ ఆర్ ఈ జి ఎస్ నిధులతో డీసీసీ అధ్యక్షులు,ప్రభుత్వ విప్ ,ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలన్న సహకారం తో ఆరేగూడెం సర్పంచ్ పేరబోయిన దివ్య మకరజ్యోతి కార్తీక్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమం లో పాలకవర్గం సభ్యులు ఉపసర్పంచ్ లత,నాగరాజు వార్డు సభ్యులు బరిగెల వెంకటేష్,పుల్లె భాస్కర్,కొల్లూరి అంజనేయులు,కొల్లూరి శ్రీహరి,పేరబోయిన మాధురి శ్రీకాంత్, మోటకొండూర్ మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్లు కొల్లూరి హరిబాబ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య సాహిత్యం- సమాలోచనం" పుస్తక సమీక్షా



రామన్నపేట, మార్చి 24(వార్తా వేదిక సూర్య): రామన్నపేటప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన " డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య సాహిత్యం- సమాలోచనం" అను పుస్తక సమీక్షా కార్యక్రమం నిర్వహించారు . కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య గొప్ప సాహితీవేత్తయని,తన ఇంటినే గ్రంథాలయంగా మార్చి సమాజానికి ఎనలేని సేవ చేస్తున్నారని, మహాకవి దాశరథి పురస్కారమే కాకుండా, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని కూడా అందుకున్న మహనీయుడని, అటువంటి వారి సాహిత్యం మీద సమగ్రంగా జాతీయ సదస్సు నిర్వహించడమే కాకుండా పుస్తకంగా తీసుకురావడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు.ఈ పుస్తక సంపాదకులు, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ జాతీయ సదస్సులో పాల్గొని పత్ర సమర్పణ చేసిన 31 మంది ఆచార్యుల, పరిశోధక విద్యార్థుల వ్యాసాలను పుస్తక రూపంగా తీసుకురావడం జరిగిందని అన్నారు.ఈ పుస్తకాన్ని మూసీ ప్రత్యేక సంచికగా వెలువరించిన ఆ పత్రిక నిర్వాహకులు ఆచార్య సాగి కమలాకర్ శర్మ గారికి, ప్రచురించిన కూరెళ్ల ఫౌండేషన్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. వెంకటేశ్వరరావుతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికలో మౌళిక సదుపాయాలు కల్పించాలి

- బి.ఆర్.ఎస్ డిమాండ్



మోత్కూరు, మార్చి 24 (వార్తా వేదిక సూర్య): మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని స్మశాన వాటికను మౌళిక సదుపాయాలను కల్పించాలని బి.ఆర్.ఎస్ జిల్లా నాయకులు బందెల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హాయంలో ఈ స్మశాన వాటికకు కోటి రూపాయలు నిధులు మంజూరైన పనులు చేపట్టకపోవడాన్ని ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ మంగళవారం స్మశాన వాటిక పరిధిలో బి.ఆర్.ఎస్.ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మశాన వాటికలో నీటి వసతి,వీధి లైట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వంలో ఈ స్మశాన వాటిక మరమ్మతుల కోసం కోటి రూపాయలు మంజూరు చేసిన పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారని ఆరోపించారు.రాత్రి వేళలో దహన ధంస్కారాలు చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మున్సిపల్ ప్రజలకు ఇబ్బందులు కాకుండా ఈ స్మశాన వాటిక పనులను వెంటనే చేపట్టాలని, అదేవిధంగా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మున్సిపల్ సిబ్బంది లలో ఒకరిని ఇక్కడ రెగ్యులర్ గా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బి.ఆర్.ఎస్. నాయకులు బొడ్డుపల్లి లక్ష్మయ్య,కూరెళ్ల సందీప్, కూరెళ్ల సతీష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## పద్మ మృతదేహానికి నివాళులు అర్పించిన నాయకులు



రామన్నపేట,మార్చి 24 (వార్తా వేదిక సూర్య ):: పట్టణ కేంద్రానికి చెందిన దేవనక పద్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు సందర్శించి పూలమాలేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గరిక సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జమీరుద్దీన్, ఉప సర్పంచ్ మోటే రమేష్, ఈ కార్యక్రమంలో వనం చంద్రశేఖర్ మహమ్మద్ నాసర్, జెల్ల వెంకటేశం, కోట సుధాకర్, సాల్వేరు లింగం, గొరిగే శేఖర్, బండ లింగస్వామి, ఆముద లక్ష్మణ్, బుర్రి ఉపేందర్, నకరికంటి సుదర్శన్, ఊట్కూరి శీను, నోముల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ అసెంబ్లీ స్థానాలను పెంచడం పట్ల హర్షం

మోత్కూరు, మార్చి 24 (వార్త వేదిక సూర్య ): దేశవ్యాప్తంగా పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో ప్రకటించడం పట్ల భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బయ్యని చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాజకీయాలలో అనేకమంది. సుదీర్ఘ రాజకీయ పరిజ్ఞానం ఉండి ఉన్నప్పటికీ రాజకీయంగా ఎదగడా నికి సరైన అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలను పెంచడం పట్ల రాజకీయంగా ఎదుగుదలకు తోడ్పాటు నిస్తుందన్నారు.



# క్షయ (టిబి) రహిత జిల్లాగా మార్చుదాం

- క్షయ వ్యాధిపై ర్యాలీ ప్రజల్లో అవగాహన
- మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్





(యాదాద్రి భువనగిరి బ్యూరో), మార్చి 24 వార్త వేదిక సూర్య : క్షయ (టి.బి) రహిత జిల్లాగా మార్చుడానికి వైద్య, ఆరోగ్యశాఖ చేస్తున్న కృషి అభినందనీయమని భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ గారు అన్నారు . ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం (టి.బి) స ందర్భంగా మంగళవారం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ, జిల్లా క్షయ వ్యాధి నివారణ శాఖ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వ హించారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రారంభమైన ర్యాలీని మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ జగదేకపూర్ చౌరస్తా వరకు కొనసాగింది. ప్లకార్డులు ప్రదర్శించి టి.బి పై ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం 100 రోజులు టి.బి ముక్త భారత్ అభియాన్ లో భాగంగా "టి.బి ఎలిమినేషన్" మిషన్ ను వైస్ చైర్మన్ పోతం శెట్టి మంజుల వెంకటేశం, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. ఎం. మనోహర్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్. మనోహర్,జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ రి మాట్లాడుతూ ప్రజల్లో క్ష్మయ వ్యాధిపై విస్తృత అవగాహన కల్పించి వ్యాధి లక్షణాలున్న వారు పరీక్షలు చేయించుకొని మందులు తీసుకు న్నట్టయితే పూర్తిగా తగ్గిపోతుందని ప్రభుత్వం ఉచిత మందులు ఇస్తుందని తెలియజేశారు, ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు, రోటరీ క్లబ్ సహకారంతో 20 మంది పేద క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార (న్యూట్రిషన్) కిట్లను చైర్మన్ శ్రీవాణి రవి కుమార్ గారు, వైస్ చైర్మన్ పంతం శెట్టి మంజుల వెంకటేశం గారు, జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. ఎం. మనోహర్ గారు, జిల్లా ప్రోగ్రాం అధికారి డా. చీ. సంశీకృష్ణ, డిప్యూటీ డియంహెచ్ డా. యశోధ, డా. సుమన్ కళ్యాణ్, రోటరీ క్లబ్ అధ్యక్షులు పి. రాజేశ్వర్ రావు, మాజీ అధ్యక్షులు ఖ. నర్సింగ్ రావుల చేతుల మీదుగా న్యూట్రిషన్ కిట్లు అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. క్షయ వ్యాధి నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. టి.బి రహిత జిల్లాగా రాష్ట్రానికే ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు. టి.బి ప్రారంభ దశ లక్షణాలను గుర్తించి అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. టి.బి ముక్త భారత్ లో భాగంగా గ్రామంలో 100 రోజులు టి.బి పర్యవేక్షణ, ఎక్రే ద్వారా వ్యాధి నిర్ధారణ జరిగిన వారికి ఉచిత చికిత్స, మందులు అందజేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులైన డా॥ రామకృష్ణ, డాక్టర్ యశోద,డా. వీణా, డాక్టర్ సుమన్ కళ్యాణ్, డాక్టర్ వంశీకృష్ణ, వైద్య అధికారులు డా॥ నిరోషా, డా. నితీషా, స్కిడ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, రోటరీ క్లబ్ మాజీ సెక్రటరీ సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు మంచి కంటి వెంకటేశం, మాజీ కౌన్సిలర్ బాలయ్య, కౌన్సిలర్లు, సభ్యులు ఎం.డి. చాంద్, క్షయ నివారణ ×జుజ, వైద్యశాఖ సిబ్బంది, మెడికల్ మరియు నర్సింగ్ విద్యార్థులు, ×హీూ భువనగిరి శాఖ తదితరులు పాల్గొన్నారు.

## తడి పొడి చెత్త నిర్వహణపై వాత్సల్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు అవగాహన



యాదాద్రి భువనగిరి/ మార్చి 24 వార్త వేదిక సూర్య :
యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి మండల పరిధిలోని గంగసానిపల్లి ముత్తిరెడ్డిగూడెం గ్రామం నందు తెలంగాణ నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ క్షేత్ర పర్యటన ప్రోగ్రాంలో భాగంగా ఘన వ్యర్థాలను వేరు చేయు విధానంపై వాత్సల్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అలాగే ముత్తిరెడ్డిగూడెం లో ఉన్న ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని సందర్శించారు. తడి, పొడి చెత్త వేరు చేయడం కంపోస్టు ఎరువు తయారీ విధానాన్ని ముఖ్య అతిథులుగా వచ్చిన టి. ఎన్. జి. సి కోఆర్డినేటర్ సూర్య కిరణ్, వాత్సల్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ మరియు స్వచ్ఛ భారత్ మిషన్ ఎస్.బి.ఎమ్. జిల్లా కోఆర్డినేటర్ మిర్యాల మురళి , ఎకో- క్లబ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని సూచిస్తూనే తడి చెత్తను పొడి చెత్తను తమ దైనందిన జీవితంలో అనుసరిస్తూ ముందుకెళ్లాలని వివరించారు. ముత్తిరెడ్డిగూడెం సర్పంచ్ రాంపల్లి కృష్ణ ఉప సర్పంచ్ అందె మల్లేష్ లు హాజరై గ్రామ తడి పొడి చెత్తను ఏ విధంగా వేరు చేయాలో మన దైనందిన జీవితంలో దానిని ఏ విధంగా అనువదించుకోవాలో వివరించడం జరిగింది. వాత్సల్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ క్షేత్ర పర్యటన ప్రోగ్రాంలో భాగంగా, ఈకో క్లబ్ లో భాగంగా ఈ రోజు మా వాత్సల్య కళాశాల విద్యార్థులు పాల్గొని అవగాహన చేసుకున్నారని, మా విద్యార్థులు నలుగురికి మార్గదర్శులుగా అవుతారని హామీ ఇచ్చారు. విద్యతోపాటు ఇలాంటి కార్యక్రమాలు చేసినప్పుడే విద్యార్థులలో నైపుణ్యం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వాత్సల్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు ప్రభాకర్, మాధవి, శ్రీశైలం, అంజయ్య, రమేష్, శ్రీనివాస్, ముత్తిరెడ్డిగూడెం సర్పంచ్ రాంపల్లి కృష్ణ ఉప సర్పంచ్ అందె మల్లేష్ ,వార్డ్ సభ్యులు జక్కుల మల్లేష్, కొండమడుగు అశోక్, ముత్తిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి కంచుగల్ల కృష్ణయ్య తోపాటు ఫీల్డ్ అసిస్టెంట్ పల్లెర్ల కుమార్ మరియు వాత్సల్య కళాశాల విద్యార్థిని విద్యార్థులు, గ్రామ పంచాయతీ సిబ్బంది మొదలైన వారు పాల్గొని తడి చెత్త పొడి చెత్త ఫీల్డ్ ట్రిప్ ను విజయవంతం చేశారు.

## తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి

- ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి



(యాదాద్రి భువనగిరి బ్యూరో),మార్చి 24 వార్త వేదిక సూర్య :
తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని రాష్ట్ర అధ్యక్షులు పూస శ్రీనివాస్ జిల్లా అధ్యక్షులు మెరుగు మధు డిమాండ్ చేశారు.మంగళవారం రోజున తెలంగాణ ఉద్యమకారుల జిల్లా స్థాయి సమావేశం భువనగిరి పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో జిల్లా అధ్యక్షులు మెరుగు మధు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలోని పలువురు ఉద్యమకారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పాత్రను స్మరించుకున్నారు. భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధి, ఉద్యమకారుల సమస్యల పరిష్కారం, ఉద్యమ స్ఫూర్తిని కొనసాగి ంచడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఖఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, పెన్షన్ సౌకర్యశీ, ప్రభుత్వం ఇస్తామన్న 250 గజాల స్థలాన్ని ఇవ్వాలని, తెలంగాణ సాధన కోసం పోరాడిన ప్రతి ఉద్యమకారుడి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. అలాగే యువతలో ఉద్యమ స్ఫూర్తిని పెంపొందించడం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపులో జిల్లాలో ఉద్యమకారుల ఐక్యతను బలోపేతం చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమ ంలో బిజెపి జిల్లా నాయకులు సుర్వి శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్, టిఎల్ఎఫ్ నాయకులు కోడిమాలకృష్ణ, వినోద్, ట్రస్మ జిల్లా అధ్యక్షులు పాలకూర వెంకటేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీరాములు, బీబీనగర్ జేఏసీ కన్వీనర్ ముస్కె జైపాల్ రెడ్డి సిపిఐ నాయకులు శోభన్ బాబు రమేష్ భాస్కర్ బద్దం వెంకట్రెడ్డి, ఆటో జాక్ నాయకులు గొర్ల లక్ష్మణ్, గోప రాజు గణేష్, పాండు రవీందర్ బాలన్, ఆత్మకూరు జేఏసీ కన్వీనర్ నిమ్మ శేఖర్ రెడ్డి, చాడా శశిధర్ రెడ్డి, ఆడెపు శ్రీను, పసునూరి నరసింహ తదితరులు పాల్గొన్నారు..

## న్యాయవాదుల సమస్యల పరిష్కారం

- బార్ కౌన్సిల్ ఆఫ్ ఐలు అభ్యర్థులు, యం శ్రీనివాసరావు, సిహెచ్ శైలజలు వేడుకలు
- ఆలిండియా లాయర్స్ యూనియన్ ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి



రామన్నపేట్ ,మార్చి 24 (వార్తా వేదిక సూర్య): న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణలో గెలుపొందిన ఐ లు అభ్యర్థులు యం శ్రీనివాస రావు, సిహెచ్ శైలజాలు, కృషి చేస్తారని ఆలిండియా లాయర్స్ యూనియన్ ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి అన్నారు. గెలుపును పురస్కరించుకొని బార్ అసోసియేషన్ లో సీట్లు పంపిణీ చేసి వేడుకలు నిర్వహించిన అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ బార్ కౌన్సిల్లో సమస్యలు పేరుకుపో యాయని వాటి పరిష్కారం కోసం బార్ కౌన్సిల్లో, మరియు న్యాయవాదులతో కలిసి పరిష్కారాన్ని కృషి చేస్తారని వారు అన్నారు. న్యాయవాదులు ఆరోగ్య భీమా అలాగే డెత్ బెనిఫిట్స్ జూనియర్ అడ్వకేట్ లకు స్టయిఫండ్ 10000 ఇవ్వాలని, మహి ళా న్యాయవాదులకు ప్రత్యేక బార్ అసోసియేషన్ లు ఏర్పాటు చేయాలని మెటర్నిరీ బెనిఫిట్ ఇవ్వాలని రాబోయే కాలంలో కృషి చేస్తామని వారు అన్నారు ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి మజీద్, ఉపాధ్యక్షులు యాదాసు యాదయ్య, ఐలు జిల్లా ఉపాధ్యక్షులు పాల్వంచ జగ్గయ్య,ఉయ్యాల హనుమ ంతు గౌడ్, కేమ రామదాసు,బాస రాజు అశోక్ కుమార్, డేవిడ్ ,దినేష్ కుమార్ నోముల స్వామి సతీష్ రెడ్డి మణికంఠ తదితరులు పాల్గొన్నారు

## అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు



యాదాద్రి భువనగిరి/మార్చి 24 వార్త వేదిక సూర్య :రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి అరాచక కమిషన్ పాలనతో తెలంగాణను భ్రష్టు పట్టిస్తూ ప్రజల బతుకులను ఆగం చేస్తూ భవిష్యత్ తరాల కు భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వంనీ అడుగడుగునా నిలదీస్తున్న బిఆర్ఎస్ బిసి కుల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం తలపెట్టిన సందర్భంగా ఈరోజు పోలీసులు బిఆర్ఎస్ పార్టీ నాయకులను అక్రమంగా ఇంటిదగ్గర అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది. ఇలాంటి అక్రమ అరెస్టుకి భయపడేది లేదని ప్రభుత్వంలో బిఆర్ఎస్ పార్టీకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ఇలాంటి కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టడం, ఈ ప్రభుత్వం దుర్మార్గ పాలన లో విసుకు చెందిన ప్రజలు రాబోయే ఎలక్షన్లో కాంగ్రెస్ పాలనకు అంతం చేయడం తథ్యం అని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ముక్కెర్ల సతీష్ యాదవ్ అలాగే కర్రె చంద్రశేఖర్ అన్నారు .ఇలాంటి అక్రమ కేసులతో ప్రజా ఉ ద్యమాలను ఆపలేరని ప్రజల కోసం పనిచేయడంలో బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు ముందుంటుంది, అరెస్ట్ అయిన వారిలో యాదాద్రి భువనగిరి జిల్లా అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉ యాదగిరిగుట్ట బిఆర్ఎస్ యువజన అధ్యక్షులు ముక్కెర్ల సతీష్ యాదవ్ మల్లాపురం గ్రామ శాఖ ఇన్చార్జ్ మరియు వార్డు సభ్యులు కర్రె చంద్రశేఖర్ గారు ఉన్నారు.

# ప్రైవేట్ ఆస్పత్రులు స్కానింగ్ సెంటర్ ల ఆకస్మిక తనిఖీ

- నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు
- జగిత్యాల జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి





కోరుట్ల: మార్చి24( వార్త వేదిక సూర్య )
కోరుట్ల పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను, స్కానింగ్ సెంటర్లను జగిత్యాల డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలని అతిక్ర మించిన వారిపై క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ఆసుపత్రులు, క్లినిక్స్ వంటి వైద్య సంస్థలు ప్రభుత్వ నియమాల ప్రకారం నమోదు అయి, ప్రమాణాలకు అనుగుణంగా సేవలు అందించాలి అనే చట్టం ను,పి.సి.పి.ఎన్.డి.టి యాక్ట్,
గర్భంలో ఉన్న శిశువు లింగాన్ని తెలుసు కోవడం లేదా చెప్పడం నిషేధించి, ఆడ శిశువుల హత్యను నివారించడానికి రూపొందించిన చట్టాల ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరిం చారు. అనుమతుల కోసం రిజిస్ట్రేషన్ సమయ ంలో సమర్పించిన డాక్టర్ల ద్వారా నే వైద్య సేవలు ందించాలని,కొత్తగాఎవరైనావచ్చినట్లయితే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల లో మళ్ళీ జతచేయాలని అలా చేశాకేవారిసేవలువినియోగించుకోవాలని తెలిపారు. 1994 గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధిత చట్టం యాక్ట్ ప్రకారం లింగ నిర్ధారణ చేసి ఆడ ,మగ అని చెప్పడం చట్టరీత్యా నేరమని మాత శిశు సంరక్షణ ఆయన పేర్కొన్నారు. స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ మిషన్స్ డాక్టర్ల అర్హత ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకున్న విధంగానే ఉన్నాయా అని నిర్ధారించుకున్నారు. ఫారం ఎఫ్ లు ప్రతినెల 5వ తారీఖు లోపు వారికికేటాయించబడిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోలలోఅప్పజెప్పాలని ఫారం ఎఫ్ లు ఆన్లైన్లో, ఆఫ్లైన్లో ఒకే విధంగా ఉండాలన్నారు. లింగ నిర్ధారణ చేసేటప్పుడు లింగ నిర్ధారణ చట్టరిత్యా నేరం అలా చేసినచో కఠిన చర్యలు తీసుకోబడతాయి అను ఫ్లెక్సీ బోర్డులు , ఫోంబోర్డులు ఏర్పాటు చేయవలెనని ఈ నిబంధనలు అతిక్రమించి లింగ నిర్ధారణ చేసినచో జరిమానా విధించబడడమే కాకుండా మూడు నెలల జైలు శిక్ష కూడా ఉంటుందని, వైద్యుల యొక్క రిజిస్ట్రేషన్ కూడారద్దుపరు చబడతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి రాజేశం, సూపర్వైసర్లునాగభూషణంధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరి
సంపుటి : 1 సంచిక : 298
వార్త వేదిక సూర్య
యాదాద్రి భువనగిరి బుధవారం మార్చి 25, 2026

## బడ్జెట్ లో విద్య రంగాన్ని విస్మరించిన ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ

# ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రులు దగ్ధం



**మోత్కూరు, మార్చి 24( వార్త వేదిక సూర్య ):** విద్యారంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేనే లేదని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తే అర్థమవుతుందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక కే.ఆర్. కార్యాలయం ముందు మోత్కూరు బిబిభువనగిరి ప్రధాన రహదారి పై ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి కమిటీ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా శాంతి కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టో లో 15% వదిలి కేటాయిస్తామని చెప్పి కేవలం 8.22, =శాతం నిధులు కేటాయించడం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10వేల కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్ స్కాలర్ షిప్ లు ఉంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేవలం పెండింగ్ స్కాలర్ షిప్స్ ,ఫీజు రీయంబర్స్ 4.343 కోట్లు కేటాయించి చేతులు దులుపుకోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి 1000 కోట్లు చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయానికి 400 కోట్లు కేటాయిస్తే రాష్ట్రంలో ఉన్న మిగతా విశ్వవిద్యాలయాల పరిస్థితి ఏంటని ఆయన అన్నారు .రాష్ట్రంలో ఉన్న ఉన్నత విశ్వవిద్యాలయాలకు తక్కువ నిధులు. కేటాయించడం తగదన్నారు యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు. సుమారుగా 5000 కోట్ల రూపాయలను కేటాయిస్తే.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ గురుకుల,సంక్షేమ వసతి గృహాలు.కస్తూరి బాలికల విద్యాలయాలు ప్రభుత్వ పాఠశాలల ఊసే లేదన్నారు డిగ్రీ కళాశాలలు, ఇంటర్నేషనల్ పాఠశాలలు,స్వంత భవనాలు నిధులు లేవని .బడ్జెట్ లో కేటాయించిన ఈ నిధులు విద్యా అభివృద్ధి కోసం కాదు..విద్యా వ్యవస్థ కు దారిద్ర్యానికే దారి తీస్తాయని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ ను చూస్తే విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆరోపించారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30% నిధులు కేటాయించాలని శాంతి కుమార్ డిమాండ్ చేశారు.లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా, మండల నాయకులు జిట్టగౌతమ్ కరుణాకర్,చందు, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరారావు**



**మోత్కూరు, మార్చి 24 (వార్తా వేదిక సూర్య):** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్క రారావు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. మంగళవారం ఆయన మోత్కూరులో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును వంట గదులకు వెళ్లి స్వయంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థుల రిజిష్టర్ ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కు సరిపడా భోజనం,పాలు అందించాలని, బియ్యం మంచిగా లేక పోతే స్పెషల్ ఆఫీసర్ కు సమాచారం అందించి బియ్యం మార్చుకోవాలన్నారు. పరీక్షలు వ్రాస్తున్న పదవ తరగతి విద్యార్థుల దగ్గరికి వెళ్లి మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. స్వామి ఆయన వెంట ఉన్నారు.

## అణిచివేత ధోరణి తగదు



**మోత్కూరు, మార్చి 24 (వార్త వేదిక సూర్య ):** పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బి.ఆర్.ఎస్.వి రాష్ట్ర కమిటీ చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా బి.ఆర్.ఎస్.వి మండల నాయకులను మోత్కూరు పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.ఈ సందర్భంగా బి. ఆర్.ఎస్.వి. మండల అధ్యక్షులు పబ్బు ప్రవీణ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేయడానికి వెళ్తున్న నాయకులను పోలీసులు అక్రమంగా పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు. అక్రమ నిర్బంధాలతో విద్యార్థుల ఉద్యమాన్ని అణిచివేయలేరని అన్నారు. ఈ అక్రమ అరెస్టులు తగదని, అరెస్ట్ చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు అరెస్ట్ అయిన వారిలో బి.ఆర్.ఎస్.వి. మండల అధ్యక్షులు పబ్బు ప్రవీణ్ తో పాటు మండల నాయకులు కూరెళ్ళ పరమేష్ ఉన్నారు.

## ముందస్తు బడిబాటని జయప్రదం చేయండి

**- సిరిగిరిపురం గ్రామ సర్పంచ్ కృష్ణవేణి శ్రీను**




**మహేశ్వరం, మార్చి 24 (వార్త వేదిక సూర్య ):** ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిరిగిరిపురం గ్రామ సర్పంచి కృష్ణవేణి శీను, ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించి, పాఠశాల ముందస్తు బడిబాట కార్యక్రమ కరపత్రాలను, బ్రోచర్లను ఉపాధ్యాయుల, గ్రామ పాలకవర్గ సమక్షంలో ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలకు దీటుగా తయారు చేశామని, పాఠశాలకు ఏ అవసరం వచ్చినా తన వంతు సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో ఉంటాయని ఈ సందర్భంగా సర్పంచ్ హామీ ఇచ్చారు.పాఠశాలకు వచ్చే పేద మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మమైన విద్యను అందించాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిరిగిరిపురం గ్రామ పాలకవర్గం, పంచాయతీ సెక్రెటరీ పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

## రైతు భరోసా దరఖాస్తుకు నేడే చివరి తేదీ

**- ఏడీఏ శాంతి నిర్మల**



**మోటకొండూరు /మార్చి 24 ,వార్త వేధిక సూర్య :**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 25వ తేదీ (బుధవారం) సాయంత్రం వరకు మాత్రమే గడువు ఉందని యాదగిరిగుట్ట ఏడీఏ శాంతి నిర్మల తెలిపారు. మంగళవారం మండలంలోని చాడ రైతు వేదిక క్లస్టర్‌లో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు.రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులందరూ నిర్ణీత గడువులోగా తమ దరఖాస్తులను ఏఈఓ లకు సమర్పించాలని ఏడీఏ సూచించారు. నేడే చివరి తేదీ కావడంతో రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోము అని ఆమె స్పష్టం చేశారు. రైతులు తమ వివరాలను సరిచూసుకుని సకాలంలో దరఖాస్తు పూర్తి చేయాలని కోరారు. అనంతరం నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ లో భాగంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో ఆమె ప్రత్యేకంగా సంభాషించారు. రసాయన ఎరువులు వాడకుండా పండించే పంటల వల్ల కలిగే ఆరోగ్య, ఆర్థిక లాభాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్న ఏడీఏ, వారికి ప్రభుత్వం నుంచి అందే ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ డి. వెంకటేష్, సీఆర్పీలు స్రవంతి, లత, ముత్తిరెడ్డిగూడెం ఉపసర్పంచ్ వెంకన్న, రైతులు కంది వెంకట్ రాంరెడ్డి, ఈరగని శ్రీనివాస్, భూపాల్ రెడ్డి, సంజీవరెడ్డి, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.




## మహిళా సంఘం డబ్బులు డ్రా చేసి ఆర్పీల పైన బ్యాంక్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

**- బట్టుపల్లి అనురా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి**



**(యాదాద్రి భువనగిరి బ్యూరో ), మార్చి 24 వార్త వేదిక సూర్య :** భువనగిరి పట్టణంలో మహిళా సంఘాల డబ్బులను సభ్యులకు తెలియకుండా డ్రా చేసుకొని సొంతంగా వాడుకున్న ఆర్పీల పైన చర్యలు తీసుకోవాలి అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ మేనేజర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ మహిళా సంఘం సభ్యులకు తెలియకుండా ఆర్పీలు డబ్బులు డ్రా చల చేయడం దుర్మార్గమైందని అన్నారు. పొదుపులో లోను తీసుకున్నప్పుడు సభ్యుల వ్యక్తిగత అకౌంట్ లోకి డబ్బులు వెయ్యాలని అలా వెయ్యకుండా ఆర్పి లు డబ్బులు మొత్తం వారికి తెలియకుండా డ్రా చేయడం ఇందులో బ్యాంక్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ లా హస్తం కూడా ఉన్నదని ఆరోపించారు. 2023లో లోన్ తీసుకుంటే ఇప్పటివరకు సంఘంలోని సభ్యులు డబ్బులు కడత లేరని బ్యాంక్ వాళ్ళు సభ్యులకు తెలుపకుండా అలాగే మెప్మా ఆఫీసర్లకు కూడా తెలియజేయక పోవడం తప్పు అని వెంటనే ఆర్పీల పైన ఫీల్డ్ ఆఫీసర్ మేనేజర్ల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ అధ్యక్షురాలు మాయ రాణి, సహాయ కార్యదర్శి మాటూరి కవిత, ఐద్వా నాయకురాలు గద్దె లత, గౌటు మంగ తదితరులు పాల్గొన్నారు.

## పనకబండకు లైన్ మెన్‌ను నియమించాలి



**మోత్కూరు, మార్చి 24 (వార్త వేదిక సూర్య) :** మండలంలోని పనకబండ గ్రామానికి లైన్ మెన్ లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆ గ్రామ సర్పంచ్ లోతుకుంట రేణుక, అనిల్ అన్నారు.మంగళవారం ఈ మేరకు లైన్ మెన్ ను నియమించాలని కోరుతూ విద్యుత్ కార్యాలయంలో ఏఈ ప్రభాకర్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 5 నెలల నుండి లైన్ మెన్ లేక ప్రజలు ఏ సమస్య వచ్చిన మోత్కూరు ఏఈ చెప్పవలసి వస్తుందన్నారు. ఇప్పటికైనా పనకబండకు లైన్ మెన్ కేటాయించాలని ఏఈని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి త్వరలో లైన్ మెన్ కేటాయిస్తానని తెలియజేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాధారపు మల్లేశం, మాజీ సర్పంచ్ బత్తిని తిరుమలేష్ గౌడ్ పాల్గొన్నారు.


## వడ్డెలా అసెంబ్లీ ముట్టడికి బీసీ జాగృతి మద్దతు




**మోటకొండూరు/మార్చి 24 వార్త వేదిక సూర్య :** వడ్డెర్ల కార్పొరేషన్ ఏర్పాటు కోసం అదేవిధంగా వడ్డెలా ఎస్టీ సాధన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలో రాగానే వడ్డెరను ఎస్టిలో చేరుస్తానని వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చి 27 నెలలు గడుస్తున్నా కూడా నిమ్మకు నీరెత్తినట్టు ప్రభుత్వం వ్యవహరిస్తుందని వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు తెలంగాణ జాగృతి నాయకులు ఎత్తరి గణేష్ మంగళవారం మోటకొండూర్ పోలీసులు ప్రివెంట్ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో అరెస్టు చేసిన సందర్భంగా ఎత్తరి గణేష్ మాట్లాడుతూ వడ్డెర చరిత్రను చదివితేఅది కేవలం జీవన పోరాటం కాదు.అది దేశ నిర్మాణానికి పునాది వేసిన శ్రమ ఇది అన్యాయానికి వ్యతిరేకంగా సాగిన నిశ్శబ్ద యుద్ధం గడ్డపార బట్టి పునాది తీసి రాళ్లు కొట్టిన మన చేతులు అనేక డ్యాముల నిర్మాణాలు రోడ్లు నిర్మిస్తూ నగరాలు నిర్మించాయి.దేశ అభివృద్ధికి మూలస్తంభాలయ్యాయి. దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మన వడ్డెర కులం.ఇప్పుడు గుర్తింపు కోల్పోయింది హక్కులు కోల్పోయింది.అవకాశాలు కోల్పోయింది.ఇది మన కులానికి జరిగిన పెద్ద అన్యాయం.మన డిమాండ్ వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి వడ్డెరలకు ౹ా రిజర్వేషన్ ఇవ్వాలి ఎందుకు అసెంబ్లీ ముట్టడిచరిత్ర చెబుతోంది.మౌనంగా ఉన్నవారికి హక్కులు రావుపోరాడినవారికే న్యాయం దక్కుతుందిఅందుకే.అసెంబ్లీ ముట్టడి ప్రోగ్రాం సురేందర్ తీసుకోవడం జరిగిందన్నారు. ప్రజాస్వామ్యంలో మన హక్కులను సాధించుకునే శాంతియుత పోరాటం వడ్డెర కులస్తులకు అందరూ ఐక్యంగా ఉండి ఒకే జాతి ఒకే వర్గంగా ఉండి మన వద్దది అక్రమ సాధించుకోవాలని అన్నారు.వడ్డెర యువత ముందుండి నాయకత్వం వహించాలి.వడ్డెర మహిళలు ఆత్మగౌరవ స్వరంగా నిలవాలి వడ్డెర కార్మికులు పోరాట బలం కావాలి వడ్డెర విద్యార్థులు చైతన్య దీపాలు కావాలి.ఒక్కో వ్యక్తి కాదు.మొత్తం మన వడ్డెర కులం ఒక శక్తిగా మారాలి.భవిష్యత్తు తరాల వడ్డెర బిడ్డల కోసం ఈ ఉద్యమంగా రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేసి ప్రభుత్వం మెడలు వంచి మన హక్కులను సాధించుకుందాం. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు రాపోలు ఎలేందర్, రాపోలు దుర్గయ్య, రాపోలు శ్రీకాంత్,ఎత్తరి బుచ్చిరాములు,రాపోలు బన్నీ,ఎత్తరి అజయ్, రాపోలు వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై నిరంతరం కృషి

**కౌన్సిలర్ రమణ**



**మోత్కూరు, మార్చి 24 (వార్త వేదిక సూర్య):** ప్రజా సమస్యలపై నిరంతరం కృషి చేస్తానని 12వ, వార్డు కౌన్సిలర్ మెంట రమణ నగేష్ లు అన్నారు. మంగళవారం ఆ వార్డు పరిధిలోని పేరు కపోయిన మురుగు కాల్వలను పరిశీలించి, విద్యుత్ స్తంభాలకు లైట్లు వెలగడం లేదని గుర్తించారు. అనంతరం మున్సిపల్ సిబ్బ ందితో మురుగు కాల్వలను శుభ్రం చేయించి, విద్యుత్ స్తంభాలకు లైట్లు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో ప్రజలకు ఏలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. వీధిలైట్లు,మురికి కాల్వలను శుభ్రం చేయించిన ఆమెను స్థానికులు అభినందించారు.

## శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ వేడుకలకు భారీ ఏర్పాట్లు

- భూదాన్ పోచంపల్లి శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో గోటి తలంబ్రాల కార్యక్రమానికి భక్తుల నుండి విశేష స్పందన
- నేడు గోటి తలంబ్రాల కార్యక్రమంలో రఘునాధపురం భక్తులు



**భూదాన్ పోచంపల్లి, మార్చి 24 ( వార్త వేదిక సూర్య ):** భూదాన్ పోచంపల్లిలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 27న జరగనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవానికి గోటి తలంబ్రాల కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. యాదాద్రి భువనగిరి జిల్లా రఘునాధపురం కు చెందిన మహిళా భక్తులు స్వామివారిని దర్శనం చేసుకుని గోటి తలంబ్రాల కార్యక్రమానికి హాజరైనారు. శ్రీరామనామ స్మరణ చేస్తూ భక్తి పారవశ్యంతో తెలంగాణలోని భద్రాచలం తరహాలో యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి లో శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో వడ్ల నుంచి బియ్యం వలచే సేవలో భక్తులు నిమగ్నమయ్యారు. దేవాలయం ప్రాంగణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. సీత రామచంద్రస్వామి తలంబ్రాల సేవలో పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. మహిళలు భగవంతుని స్మరిస్తూ సేవలో తరిస్తున్నారు. సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవానికి దేవాలయ చైర్మన్ బల్ల దుర్వాసులు భారీ ఏర్పాటు చేస్తున్నారు. కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు , భక్తులకు సౌకర్యాల కల్పన, దేవాలయ అభివృద్ధి కోసం వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని దేవాలయ చైర్మన్ బల్ల దుర్వాసులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ ఉపాధ్యక్షులు సకినాల నాగయ్య , ప్రధాన కార్యదర్శి జోగు లక్ష్మీనారాయణ , సహాయ కార్యదర్శి వనం ఉభయాకర్ , కోశాధికారి అంబటి భానుచందర్, ధర్మకర్తలు కొంక వీరేశం , విడం చక్రపాణి, బైరు లక్ష్మయ్య, సామల కైలాసం, గర్దాసు ఉప్పలయ్య, ఏరవ విగ్నేష్, చిట్టిమల్ల లక్ష్మీనారాయణ, గంజి చంద్రకళ , ఆడెపు ఎల్లమ్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**